Happy Ugadi
ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
ఆదివారం 30 మార్చి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.105	170	200
నల్లగొండ	రూ.110	180	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.5 । కనిష్ఠం 22.4

నేడు హుజూర్‌నగర్‌కు
సీఎం రాక

- ఉగాది పండుగ వేళ పేదలకు సన్నబియ్యం
- ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- 50వేల మందితో బహిరంగ సభ



హుజూర్‌నగర్‌లో సీఎం సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్

హుజూర్‌నగర్,మార్చి 29(ఆంధ్రజ్యోతి):తెలుగు కొత్తసంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా పేదలకు సన్నబియ్యం పథకాన్ని హుజూర్‌నగర్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. పౌరసరఫరాలశాఖ మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొంత నియోజకవర్గం హుజూర్‌నగర్‌లో ఆదివారం సాయంత్రం ఈపథకాన్ని ప్రారంభించనున్నారు. రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ అవుతున్న దొడ్డు బియ్యం పక్కదారి పడుతోందని,కిలో రూ.40వెచ్చించి పేదలకు అందిస్తుంటే రూ.5నుంచి రూ.10లకే దళారులకుచేరుతోందని ప్రభుత్వం గుర్తించింది. దీంతో సన్నబియ్యం పథకానికి ప్రభుత్వం రూపకల్పన చేసి హుజూర్‌నగర్‌లో ప్రారంభించనుంది.

సీఎం పర్యటన ఇలా..

సీఎం సభను హుజూర్‌నగర్ పట్టణంలో ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సాయంత్రం 5గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరి 5.45గంటలకు హుజూర్‌నగర్‌లోని ఫణిగిరి గట్టు మీద ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ వద్ద దిగుతారు. అక్కడ నిర్మాణంలో ఉన్న 2,160 మోడల్ కాలనీ ఇళ్లను పరిశీలించి 6.05గంటలకు హెలీకాప్టర్‌లో బయల్దేరి 6.15 గంటలకు రాజీవ్‌గాంధీ సభా ప్రాంగణానికి చేరుకుంటారు. 6.15 నుంచి 7.30గంటల వరకు నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారు. సభ అనంతరం 7.30 గంటలకు సీఎం హుజూర్‌నగర్ నుంచి రోడ్డు మార్గం గుండా బయలుదేరి కోదాడ మీదుగా 9.45గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు.

సీఎం నుంచి సన్న బియ్యం అందుకునే లబ్ధిదారులు వీరే..

సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సన్నబియ్యం పంపిణీకి 15...


- మిగతా 7వ పేజీలో...

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:35 (ఆదివారం సాయంత్రం)



ఊరిస్తున్న పదవి
వరించేనా?

- క్యాబినెట్ విస్తరణపై జిల్లా ఎమ్మెల్యేల ఆశలు
- రాజగోపాల్‌రెడ్డికి ఛాన్స్ ఖాయమంటున్న కాంగ్రెస్ వర్గాలు
- అవకాశం దక్కుతుందనే విశ్వాసంలో బాలూనాయక్
- కొత్త ఏడాది ఉమ్మడి జిల్లాకు మరో క్యాబినెట్ పదవి వస్తుందనే ఆశాభావం



నూతన తెలుగు సంవత్సరాది కానుకగా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు మూడో క్యాబినెట్ పదవి దక్కుతుందనే ఆశాభావం కాంగ్రెస్ నేతల శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. ఉగాది, రంజాన్ పండుగలు ముగియగానే క్యాబినెట్ విస్తరణ ఉంటుందనే సంకేతాలతో ఉత్కంఠ కొనసాగుతోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ మంత్రి పదవి కోసం ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగించడంతో బెర్తు ఎవరికి దక్కుతుందనే ఆసక్తి నెలకొంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జిగా మీనాక్షి నటరాజన్ బాధ్యతలు తీసుకున్న తరువాత పార్టీ అధికారంలోకి రావడానికి దోహదపడ్డ నాయకుల జాబితా తెప్పించుకోవడం, గడచిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భాల్లో అధిష్ఠానం ఇచ్చిన హామీల అమలుకు కార్యాచరణ అమలులోకి తేవడం ప్రారంభించారు. అందులో భాగంగానే ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్‌కు అవకాశం దక్కింది. అదే ఒరవడిలో తాజా క్యాబినెట్ విస్తరణ ఉండనుందని, ఏదైనా సమీకరణాల్లో క్యాబినెట్‌లో అవకాశం కల్పించలేకపోయిన నేతలకు సమానస్థాయి పదవులు ఇప్పించేందుకు అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది.

హామీ మేరకు మంత్రి పదవి దక్కుతుందన్న నమ్మకంలో రాజగోపాల్‌రెడ్డి


మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి విస్తరణలో మంత్రిపదవి దక్కుతుందనే చర్చ బలంగా సాగుతోంది. ఆయన బీజేపీ నుంచి తిరిగి కాంగ్రెస్‌లో చేరిన సందర్భంలో, అదేవిధంగా గడచిన లోక్‌సభ ఎన్నికల సందర్భంలో అధిష్ఠానవర్గం ఆయనకు మంత్రి పదవి ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిందని, దాన్ని నెరవేర్చేక్రమంలో తనకు మంత్రిపదవి వస్తుందనే ధీమాలో రాజగోపాల్‌రెడ్డి ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రాజగోపాల్‌రెడ్డి ఇంటికి వెళ్లి మరీ ఎన్నికల ప్రచార బాధ్యతలు తీసుకొని భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఆ ఎన్నికలో లోక్‌సభ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు, అభ్యర్థి గెలుపునకు రాజగోపాల్‌రెడ్డి కృషిచేశారని ఫలితాల అనంతరం పార్టీ ముఖ్యనేతలు ప్రకటించారు. ఇటీవల ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సైతం రాజగోపాల్‌రెడ్డికి మంత్రివర్గ విస్తరణలో చోటు..

- మిగతా 7వ పేజీలో...



శుభ్రుచుల మేళవింపు
ఉగాది

నేడు శ్రీవిశ్వావసునామ సంవత్సరం
ప్రత్యేక పూజలకు సిద్ధమైన ఆలయాలు



తెలుగు నూతన సంవత్సరం... శ్రీవిశ్వావసు నామ ఉగాదికి సర్వం సిద్ధమైంది. ఆదివారం నుంచి ప్రారంభం కానున్న నూతన సంవత్సరం తొలిరోజు ఆలయాల్లో పూజలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం వేద పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు. జీవితాన్ని ప్రతిబింబించే తీపి, పులుపు, చేదుతో కూడిన ఉగాది పచ్చడి, భక్షాలు ప్రతీ ఇంట గుమగుమలాడనున్నాయి. మట్టి కుండలు, వేప కొమ్మలు, మామిడాకులు, పూజా సామగ్రి కొనుగోళ్లతో జిల్లా కేంద్రం సహా అంతటా సందడి నెలకొన్నది.

6లో..



నల్లగొండ పట్టణంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం సుడిగాలి పర్యటన చేశారు. ఎన్జీ కళాశాలలో మార్నింగ్ వాక్‌చేసి కళాశాల బయట ఉన్న ఓ బండి వద్ద ఇలా అల్పాహారం చేశారు.

•8లో..

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...
అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !
పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.
సంప్రదించగలరు : నల్లగొండ, చండూరు, చిట్యాల, నకిరేకల్, కట్టంగూర్
ACM - 9985411394
Nalgonda ACO - 9985410334, Nalgonda-1 ACO - 9985411407
Chandur SR - 9849337588, Chityala SR - 9010198664,
Nakrekal SR - 9963624250, Kattangoor SR - 9177221185





మోత్కూరులో ఎడ్ల బండ్లు, బోనాల ప్రదర్శన(ఫైల్)

ఓ లింగా..! ఓ లింగా

● మోత్కూరులో వినూత్నంగా ఉగాది వేడుకలు ● గ్రామ దేవతలకు బోనాలు, ఎడ్ల బండ్ల ప్రదర్శన ● ఉగాది పర్వదినం నేడు



మోత్కూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలో ఉగాది వేడుకలు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వినూత్న రీతిలో జరుగుతాయి. ఉగాది పండుగ రోజు గ్రామదేవతలకు చలిబోనం సమర్పించడం, ఆలయాల చుట్టూ ఓ లింగా.. ఓ లింగా అంటూ ఎడ్లబండ్లు, వాహనాలు తిప్పడం ఇక్కడ ప్రత్యేకత. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఆషాడం, లేదా శ్రావణ మాసాల్లో బోనాల పండుగలు నిర్వహిస్తారు.

మోత్కూరు పట్టణంలో తూర్పున, పడమరన ముత్యాలమ్మ తల్లి గ్రామదేవతల ఆలయాలున్నాయి. ఇక్కడ శ్రావణంలో, ఉగాదికి రెండుసార్లు బోనాల పండుగ జరుపుకుని గ్రామదేవతలు ముత్యాలమ్మతల్లులకు బోనాలు సమర్పిస్తారు. మోత్కూరు పట్టణ వాసులు దసరా, సంక్రాంతి పండుగలకు పిలుచుకున్నట్టుగానే తమ బంధువులు, స్నేహితులను ఉగాదికి పిలుచుకుంటారు. ఇప్పుడు కలర్స్ అధిక ధర ఉండటంతో వేయడంలేదుగాని పూర్వం రోజుల్లో ప్రతీ ఇంటికి ఉగాదికి సున్నం వేసుకునే వారు. ఉగాదికి ముందురోజు మహిళలు ముత్యాలమ్మ గ్రామ దేవతలకు బోనం వండుతారు. ఉగాది రోజున మహిళలు చలి బోనాలను అలంకరించి, ప్రదర్శనగా తీసుకెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పిస్తారు. రైతులు తమ ఎడ్లను, బండ్లను, వాహనదారులు తమ వాహనాలను శుభ్రంగా కడిగి రంగులు, వేపమండలు, మామిడి తోరణాలతో అలంకరిస్తారు. పట్టణానికి తూర్పున ఉన్న ముత్యాలమ్మ తల్లి ఆలయం చుట్టూ ఎడ్ల బండ్లు, వాహనాలు తిరిగేంత స్థలం లేకపోవడంతో ఆలయానికి సమీపాన ఉన్న ఉన్నత పాఠశాల ఆవరణకు మహిళలు బోనాలతో చేరుకుంటారు. ఎడ్లబండ్లు, వాహనాలు అక్కడకు తీసుకెళ్లి పోటీలో పాల్గొన్నట్టుగా బోనాల చుట్టూ ప్రదక్షిణగా తిప్పుతారు. ఎడ్లబండ్లు, వాహనాలు తిరిగిన తర్వాత కొందరు బోనాలు తీసుకెళ్లి తూర్పున ఉన్న ముత్యాలమ్మ దేవతకు, మరి కొందరు పడమరన ఉన్న ముత్యాలమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించడంతోపాటు, నూతన వస్త్రాలు పెట్టి, టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకుంటారు. రాష్ట్రవ్యాప్తంగా ఉగాది రోజు మటన్, చికెన్ ముట్టరు. కాని మోత్కూరులో ముత్యాలమ్మకు గొర్రెలు, మేకలు, కోళ్ల బలిస్తారు. ఉగాది పచ్చడితో పాటు పంచభక్ష పరమాన్నాలు, మద్యం మాంసాదులతో విందులు చేసుకుంటారు.

యుగాదే .. ఉగాది

● నేటి నుంచి శ్రీవిశ్వావసు నామ సంవత్సరం

నిడమనూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): యుగాది అనగా యుగానికి మొదలు అని అర్థం. బ్రహ్మ సృష్టిని తయారు చేయడం ఈరోజు నుంచే మొదలు పెట్టినందున యుగాది అని పేరు వచ్చినట్లు శాస్త్రం చెబుతోంది. ప్రతీ సంవత్సరం యుగానికి మొదటి దినంగా భావించి ఈరోజు యుగాది పండుగను జరుపుకుంటారు. ఈ యుగాదే కాలక్రమేణా ఉగాదిగా మారిందని పండితులు చెబుతున్నారు. ఉగాది తెలుగువారికి తొలి పండుగ. తెలుగు కొత్త సంవత్సరం కూడా ఈరోజు నుంచే మొదలవుతుంది. వసంత రుతువులో వచ్చే ఉగాది పండుగంటే కృష్ణుడికి ఎంతో ఇష్టమని భగవద్గీతలో ఉంది. ఉగాది పండుగ రోజు ప్రముఖులకు పూర్ణకుంభం దానం చేస్తే వారి జీవితం సంపూర్ణంగా, సంతోషంగా కొనసాగుతుందని విశ్వసిస్తారు. ప్రజలు పండుగ రోజు తెల్లవారుజామునే లేచి స్నానమాచరిస్తారు. దీంతో శరీరానికి కలిగిన దోషాలన్నీ తొలగిపోతాయని నమ్ముతారు. అదే విధంగా ఆనందంగా ఉండేందుకు నూతన వస్త్రాలు ధరించి దేవుళ్లకు పూజలు చేయడం సాంప్రదాయం. బొబ్బట్లు, పూర్ణాలు వంటి పిండి వంటలు ఉగాది పండుగ సాంప్రదాయం. ఏడాది పాటు అన్నీ శుభాలు జరగాలని కోరుతూ ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కడతారు. సంవత్సరం పాటు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు నింబ కుసుమ భక్షణం అని పిలువబడే ఆరు రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని ఎంతో ఇష్టంగా ఆరగిస్తారు. అనంతరం గ్రామ చావిడి, దేవాలయాల్లో బ్రాహ్మణులు చదివే పంచాంగ శ్రవణం వింటారు. ఏడాదిలో జరిగే మంచిచెడుల వివరాలను పంచాంగం ద్వారా బ్రాహ్మణులు ప్రజలకు వివరిస్తారు. శ్రీక్రోధినామ సంవత్సరం ముగిసి నేటి నుంచి శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ప్రారంభమవుతుంది.

సరికొత్త ఆశలు చిగురించాలి



శ్రీవిశ్వావసునామ సంవత్సరంలో ప్రజలందరి జీవితాల్లో సరికొత్త ఆశలు చిగురించాలి. ప్రభుత్వం పట్టించుకోకున్నా ప్రకృతి కరుణించాలి. వర్షాలు సమృద్ధిగా కురిసి ఇకముందు పంటలు మంచిగా పండాలి. రైతులతోపాటు అన్ని రంగాల ప్రజలు అభివృద్ధిలో ముందుకు సాగాలి. ఉగాది పండుగను ప్రజలంతా ఐక్యతతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి.

జగదీ‌ష్‌రెడ్డి, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే

ఉగాది పర్వదిన శుభాకాంక్షలు



ఉగాది పర్వదినం సందర్భంగా తెలంగాణ ప్రజలకు తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు. విశ్వావసు నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలి. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పుష్కలంగా పండి రైతులు ఆనందంగా ఉండాలి.

గుత్తాసుఖేందర్‌రెడ్డి, మండలి చైర్మన్

ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి



తెలుగు నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలి. రేషన్ కార్డున్న ప్రతీ తెలంగాణ బిడ్డకు సన్న బియ్యం అందించే సంక్షేమ కార్యక్రమాన్ని ఉగాది పండుగ సందర్భంగా సూర్యాపేటలో ప్రారంభించనున్నాం. తీపి, కారం, ఉప్పు, పులుపు, వగరు, చేదు వంటి షడ్రుచుల సమ్మేళనమనే సందేశాన్నిచ్చే ఉగాది పండుగను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలి.

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి

ఇటుక బట్టీల కూలీల తిరుగు ప్రయాణం



ఆత్మకూర్(ఎస్), మార్చి 29(ఆంధ్రజ్యోతి): బాలికపై ఇటుక బట్టీ యజమాని అత్యాచారయత్నం ఘటనతో అక్కడ పనిచేస్తున్న కూలీలు వారి రాష్ట్రమైన ఒడిశాకు శనివారం తిరుగు ప్రయాణమయ్యారు. జీవనోపాధి కోసం వందల కిలో మీటర్లు వచ్చి పని చేసేందుకు పిల్లలు సహా వలస వచ్చిన కూలీలపై ఇటుక బట్టీల యజమానులు చేస్తున్న అకృత్యాలను భరించలేక మధ్యలోనే ఇంటిదారి పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆత్మకూర్(ఎస్) మండలం పాత సూర్యాపేట గ్రామ శివారులోని వెంగమాంబ బాలాజీ హాలోబ్రిక్స్‌లో పని చేస్తున్న 15 ఏళ్ల ఒడిశా కూలీ బాలికపై యజమాని అత్యాచారయత్నం చేయగా పోలీసులను ఆశ్రయించడంతో, అతనిపై కేసు నమోదు చేశారు. బట్టి యజమాని అరెస్టు కావడంతో బట్టీలో పని లేక, అతని వద్ద పని చేయలేక సొంత గ్రామానికి వలస బాటపట్టారు. బాలిక అత్యాచారయత్నం సంఘటనతో సుమారు 40మందికి పైగా ఉన్న ఒడిశా కూలీలు ఆందోళనకు గురై ఒప్పందం మధ్యలోనే వెళ్లిపోతున్నారు. ఇటుక బట్టీల్లో కూలీలపై ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పటికీ వెలుగు చూడడంలేదని విమర్శలొస్తున్నాయి. ఆత్మకూర్(ఎస్) మండలంతో పాటు చివ్వెంల, సూర్యాపేట, మోతె, అర్వపల్లి మండలాల్లో ఇటుక బట్టీల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇటుక బట్టీల కారణంగా పరిసర ప్రాంతాల్లో పంట పొలాలు పాడవుతున్నాయని రైతులు అధికారులకు ఫిర్యాదు చేసినా, ఎలాంటి చర్యలు లేవని విమర్శలొస్తున్నాయి.

పక్కింటి వారు తిట్టారని మహిళ ఆత్మహత్య

తిరుమలగిరి రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండ గ్రామానికి చెందిన వేల్పుకొండ మంజుల(42) పక్కింటి వారు తిట్టారనే కారణంతో శనివారం మధ్యాహ్నం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మంజుల కుమారుడైన వేల్పుకొండ యాకస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

భార్యను ఆస్పత్రికి తీసుకెళుతూ భర్త మృతి

● భార్య, బావమరిదికి తీవ్రగాయాలు ● మృతుడికి ఐదేళ్లలోపు ముగ్గురు పిల్లలు ● ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు ● నాగార్జునసాగర్‌లో ఘటన



ఘటనాస్థలిలో క్షతగాత్రులు, బాబురావు మృతదేహం

నాగార్జునసాగర్, పెద్దవూర, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): భార్యను ఆస్పత్రికి తీసుకెళుతూ రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందాడు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ మండలంలో శనివారం ఈ ఘటన జరిగింది. పెద్దవూర ఎస్‌ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్) మండలం పిల్లిగుండ్ల తండాకు చెందిన సపావత్ బాబురావు(28) అనే వ్యక్తి తన భార్య అనిత(25)ను నార్కెట్‌పల్లి కామినేని ఆసుపత్రిలో చూపించడానికి తన బావమరిది (భార్య తమ్ముడు) రమావత్ నరేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై శనివారం ఉదయం బయలుదేరి వెళుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్-మాచర్ల ప్రధాన రహదారిపై సాగర్‌లోని దయ్యాలగండి పుష్కర ఘాట్ వద్దకు రాగానే ఎదురుగా అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ కారులో జోగులాంబ గద్వాల్ జిల్లా మల్లకల్ మండలం ఎలకేరు గ్రామానికి చెందిన రేలంపాటి భీమన్న హైదరాబాద్ నుంచి మాచర్ల వైపునకు వస్తున్నారు. కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న ముగ్గురు రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాద ఘటనను చూసిన అటుగా వెళుతున్న వ్యక్తి 108కి సమాచారం ఇచ్చారు. ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో మొదటగా నరేష్‌ను చికిత్స నిమిత్తం సాగర్ కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత 108 వాహనంలో బాబురావు, అతని భార్య అనితను సాగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కాలు విరిగి తలకు బలమైన గాయాలైన బాబురావును ఆసుపత్రికి తీసుకెళుతుండగా, మార్గంమధ్యలోనే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. బాబురావు భార్య, బావమరిదిని మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనితకు తల, నడుముకు, నరేష్‌కు కాలు, తలకు బలమైన గాయాలయ్యాయి. ఈ ఘటనపై బాబురావు తండ్రి సపావత్ భాష్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా బాబురావుకు ఐదేళ్లలోపు వయస్సుగల ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

హైవే పై పండుగ వాహనాల రద్దీ



చౌటుప్పల్ పట్టణంలో ట్రాఫిక్ రద్దీ

చౌటుప్పల్ టౌన్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నెంబరు జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం నుంచి వాహనాల రద్దీ పెరిగింది. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా ఆదివారం నుంచి వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు ప్రజలు పయనమయ్యారు. దీంతో పట్టణంలోని హైవేపై వాహనాల రద్దీ నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు వాహనాల క్రమబద్ధీకరించారు.

31న పనిచేయనున్న రిజిస్ట్రేషన్ శాఖ

● ఎల్‌ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్‌లే కారణం
● ఉమ్మడి జిల్లాలో ఉద్యోగులు హాజరు కావాలని ఆదేశం



నల్లగొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 15 సబ్ రిజిస్ట్రార్‌ల కార్యాలయంతో పాటు జిల్లా కేంద్రంలోని డీఆర్ కార్యాలయం తెరచి ఉంటుందని ఆరోజు యదావిధిగా కార్యాలయాలు పనిచేస్తాయని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ ఎస్.ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం రుసుములో ఇచ్చిన రాయితీ గడువు ఈనెల 31 వరకు ముగియనున్నందున ఆరోజు రిజిస్ట్రేషన్‌ల కోసం కార్యాలయాలు పనిచేస్తాయన్నారు. రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ మదుసూదన్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు పనిచేయడం జరుగుతుందని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులంతా విధులకు హాజరు కావాలని ఆదేశాలు ఇచ్చారు. ఇదిలా ఉంటే 31వ తేదీన బ్యాంకులు కూడా పనిచేయనున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తున్నందున ఎల్‌ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్‌లను జిల్లా రిజిస్ట్రార్ చేసుకోవాలని కోరారు.

పండుగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట(కలెక్టరేట్), మార్చి 29,(ఆంధ్రజ్యోతి): అన్ని మతాల పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సూర్యాపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ముస్లింలకు శనివారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన మాట్లాడారు. అన్ని మతాల్లో ఐక్యతను పెంచిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనన్నారు. ఉద్యమ సమయంలోనే ఇఫ్తార్‌ను ప్రారంభించుకున్నామన్నారు. రాబోయే రోజుల్లోనూ ఇటువంటి సంస్కృతి కొనసాగాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటికే రంజాన్ తోఫా నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, నాయకులు సయ్యద్ సలీం, భాషా, తాహేర్‌పాష, రియాజ్, రఫీ, సయ్యద్ పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి నియోజకవర్గ పరిధిలోని 210 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

సూర్యాపేటరూరల్, అర్బన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ పెట్రోలియంలో పనిచేస్తున్న ఆయిల్ ట్యాంకర్స్ డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని ఇమాంపేట హెచ్‌పీసీయల్ డిపో ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. నెల రోజుల నుంచి యాజమాన్యానికి వర్కర్లతో సంబంధం లేకున్నా కక్ష సాధింపు చర్యలతో ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం వర్కర్లు మాట్లాడుకుని సమస్య పరిష్కరించుకున్నా ట్రాన్స్‌పోర్టు యాజమాన్యాన్ని ఒత్తిడికి గురిచేసి అన్యాయంగా 16 మందిని తొలగించి ఇద్దరు డ్రైవర్లని హెచ్‌పీసీఎల్ డీజీఎం పేరుతో రూ.20ల బాండ్‌పై యూనియన్‌తో సంబంధం లేకుండా బెదిరించి ఒప్పించి రాయించుకుని విధుల్లోకి తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు దూళిపాల ధనుంజయనాయుడు, రేమిడాల రాజు, జడ శ్రీనివాస్, దంతాల రాంబాబు, రాజరామ్, అశోక్, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, పాపిరెడ్డి పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

సూర్యాపేటఅర్బన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): బీసీల 42శాతం రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చలమల్ల నర్సింహ అన్నారు. ఏప్రిల్ 2వ తేదీన ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో జరిగే బీసీ పోరుగర్జన వాల్ పోస్టర్‌ను శనివారం జిల్లాకేంద్రంలోని మహాత్మ జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నిద్రసంపత్‌నాయుడు, దాసరి వెంకన్నయాదవ్, యలగందుల సుదర్శన్, శ్రీనివాస్‌గౌడ్, లింగయ్యయాదవ్, దశరథ, వెంకన్న, రవి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రామచంద్రయాదవ్, నాగేందర్, జానకిరాములు, కృష్ణ పాల్గొన్నారు.

అన్నం పెట్టే రైతులను ఆదుకోవాలి



పెన్‌పహాడ్ మండలంలో పొలాలను పరిశీలిస్తున్న గౌరీ శంకర్

సూర్యాపేట(కలెక్టరేట్), పెన్‌పహాడ్, మార్చి 29, (ఆంధ్రజ్యోతి): అన్నం పెట్టే రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అధ్యయన కమిటీ సభ్యుడు, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. సూర్యాపేట జిల్లా సూర్యాపేట సమీపంలోని చివ్వెంల, పెన్‌పహాడ్ మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో ఎండిన పొలాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ధాన్యాగార జిల్లాగా పేరు గాంచిన సూర్యాపేట నేడు కన్నీరు పెడుతోందన్నారు. నాడు నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణలో పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ సాధించిన అనంతరం పదేళ్ల పాలనలో వేసవిలోనూ చెరువులు మత్తడి దూకాయన్నారు. పంటలు ఎండిపోయి రైతులు పశువులను మేపుతున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యం కంటే ఎక్కువ నష్టం జరిగిందన్నారు. రైతులను కన్నీళ్లు పెట్టించే ప్రభుత్వాలు మనుజాలవన్నారు.

కలెక్టరేట్‌కు పది కిలోమీటర్ల దూరంలో రైతుల పంటలు ఎండిపోయి కన్నీళ్లు పెడుతుంటే కనీసం అధికారులు బాధ్యతగా వ్యవహరించకపోవడం బాధాకరమన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌పై కోపంతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. సీనియర్ జర్నలిస్టు టంకశాల అశోక్, హైకోర్టు న్యాయవాది, తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్రాచారి మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో పంటలకు నీళ్లు ఇస్తామంటేనే రైతులు పంటలు సాగుచేశారని అలాంటప్పుడు నీళ్లు ఇవ్వకుండా రైతులను మోసం చేయడం తగదన్నారు. పంటలు చివరి దశలో ఉన్నాయని రెండు తడులకు నీళ్లు ఇచ్చినా పంటలు చేతికొస్తాయని రైతులు వాపోతున్నట్లు తెలిపారు. చెరువులు నింపకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పోయడం లేదన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకుంటామనే భరోసా ఇవ్వాలని కోరారు. సూర్యాపేటలో కొన్నేళ్ల క్రితం మూసీ మురుగు నీరు మాకొద్దు కృష్ణాజలాలు కావాలని ఉద్యమించిన రోజులున్నాయన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



తిరుమలగిరి రూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామానికి చెందిన గుండ్ల ప్రసాద్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. బీహార్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నాడు. రుకుమాపూర్ చొప్పదండి సైనిక పాఠశాలలో ప్రసాద్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన పోటీల్లో జట్టును ప్రథమ స్థానంలో నిలిపి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు.

సైన్స్ ఒలంపియాడ్‌లో 'తేజ' విద్యార్థుల ప్రతిభ

కోదాడ రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత సంవత్సరం డిసెంబర్ నెలలో గణిత, సైన్స్ ఒలంపియాడ్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో మండలంలోని కొమరబండ తేజ విద్యాలయం విద్యార్థులు 21 మంది ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించారు. గణితంలో 12 మంది, 10వ తరగతికి చెందిన అఫ్సా జబీన్, హేమంత్‌రెడ్డి, 9వ తరగతి విద్యార్థులు ప్రసన్, క్షత్రజ్ఞ, 8వ తరగతి విద్యార్థులు భవజ్ఞ, షమిత్, ఓం గణేష్, 7వ తరగతి విద్యార్థులు మోక్షిత్, ప్రజ్వల్, 6వ తరగతి విద్యార్థులు నిరంజన్, సోమ వెంకట శ్లోక, రిషిత్ సాయి ఉన్నారు. అదేవిధంగా సైన్స్ ఒలంపియాడ్‌లో 19మంది విద్యార్థులు ఉన్నారు. 10వ తరగతి విద్యార్థులు సాయిచరణ్‌రెడ్డి, శివరాంరెడ్డి, 9వ తరగతి విద్యార్థి నాగ ప్రణీత్, 8వ తరగతి విద్యార్థులు షమిత్ కృషి, దేవేశ్వర్ ప్రసాద్, 7వ తరగతి విద్యార్థి భానుప్రకాష్, 6వ తరగతి విద్యార్థి ఆరాధ్య, 5వ తరగతి విద్యార్థులు సంతోషి, జునైద్ ఉన్నారు. ఒలంపియాడ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను కోదాడలోని పిల్లల వైద్యుడు శివప్రసాద్‌రెడ్డి, పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య అభినందించారు. పాఠశాల విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు సూర్యాపేట జనవిజ్ఞాన వేదిక సభ్యుడు షేక్ జాఫర్ షరీఫ్ సైన్స్ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తేజ విద్యాలయ డైరెక్టర్లు సోమిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మంత్రిప్రగడ వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

రాజ్యాంగం రద్దుకు బీజేపీ కుట్ర

సూర్యాపేటటౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం రద్దు కోసం బీజేపీ కుట్రలు చేస్తోందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం జరిగిన కేవీపీఎస్ వర్క్‌షాప్‌లో మాట్లాడారు. దళితులకు నేటికీ గుడి ప్రవేశాలు లేని గ్రామాలు, బతుకమ్మ ఆడనివ్వని గ్రామాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా అనేక రూపాల్లో కుల వివక్ష, అంటరానితనం కొనసాగుతోందన్నారు. కులవివక్ష, అంటరానితనం పాలదోలడానికి ఉన్న చట్టాలు, జీవోలు, రాజ్యాంగ బద్ధమైన హక్కులను పాలక వర్గాలు సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. పగడాల ప్రవీణ్ మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి నాయకులు వెంకటరమణ, నాగమణి, రమణ, కృష్ణ, విజయ్, వెంకన్న, రవి, రవిందర్, మధు, దనమూర్తి, లింగయ్య, బిక్షం, ప్రవీణ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

సూర్యాపేటఅర్బన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కుడకుడలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సువెన్‌ఫార్మా, అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించి మెరుగైన ఫలితాలు సాధించే విధంగా తల్లిదండ్రులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దరావత్ వీరన్ననాయక్, వేములకొండ పద్మ, ఏలిమినేటి అబినయ్, కర్ణాకర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, ఆలేటి మాణిక్యం, సువెన్ ఫార్మా హెచ్‌ఆర్ హెడ్ వెంకటరమణ, పీఆర్‌వో దుస్సా సైదులు, రాంరెడ్డి, కవిత పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ దేశంలోనే చరిత్రాత్మకం


తుంగతుర్తి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ రోజు ప్రారంభించే సన్నబియ్యం పంపిణీ పథకం దేశ చరిత్రలోనే చరిత్రాత్మకంగా నిలుస్తుందని వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న అన్నారు. తుంగతుర్తిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఏర్పడ్డ ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం నిర్మించే దిశగా చేస్తోందన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికీ సన్నబియ్యం పంపిణీ దేశ చరిత్రలోనే ఒక మైలురాయి లాంతటిందని వ్యాఖ్యానించారు. పదేళ్లు ప్రజలను మోసగించిన సీఎం కేసీఆర్ తిరిగి ప్రజల్లోకి వస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు తప్పట్ల శంకర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు దాసరి శ్రీను, కంకొట్ల మల్లేష్, మాచర్ల అనీల్, మిరియాల నాగయ్య, మంగళపల్లి నాగరాజు, బొడ్డు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

'రైతుల సంక్షేమానికి పాలకవర్గం కృషి'

తుంగతుర్తి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రైతుల సహకారంతో సంఘం అభివృద్ధికి కృషిచేస్తోందని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలకేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన మహాజనసభ సమావేశంలో మాట్లాడారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని, సెప్టెంబరు-24 నుంచి మార్చి 25 వరకు సొసైటీ ఆధ్వర్యంలో దాదాపు రూ.8కోట్ల17లక్షల లావాదీవీలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు మోడెం శ్రీలత, కేతిరెడ్డి రవీందర్‌రెడ్డి, ఎండీ మజీద్, పెండెం యాదగిరి, కాకులారపు బిక్షంరెడ్డి, ఎనగందుల రామచంద్రు, యల్లయ్య, పూలమ్మ, రామనర్సమ్మ, సొసైటీ కార్యదర్శి వందనపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో రెండు రోజుల్లో ముగియనుంది. కానీ ఉమ్మడి జిల్లాలోనూ, పలు మునిసిపాలిటీల్లో ఆశించిన స్థాయిలో ఆస్తి పన్ను వసూలు కాకపోవడంతో ఆర్థిక సంఘం నిధులకు కత్తెర పడే ప్రమాదం ఉంది. దీంతో ఆస్తి పన్ను వసూళ్లకు ఆయా మునిసిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో తీవ్రంగా శ్రమిస్తున్నారు. మార్చి 31వ తేదీ లోపు ఆస్తి పన్ను చెల్లించే వారికి జరిమానాలో లభిస్తున్న 90శాతం రాయితీని సద్వినియోగం చేసుకుంటూ సకాలంలో పన్నులు చెల్లించాలని విరివిగా ప్రచారం చేస్తున్నారు. కానీ ఉమ్మడి జిల్లాలోనే సీనియర్ మునిసిపాలిటీలైన నల్లగొండ, సూర్యాపేట ఆస్తి పన్ను వసూళ్లలో గణనీయంగా వెనుకబడినట్లు మునిసిపల్ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. శుక్రవారం నాటికి ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా చండూరులో 79.1 శాతం, కనిష్ఠంగా నకిరేకల్‌లో కేవలం 25.84శాతం మాత్రమే ఆస్తి పన్ను వసూలు అయ్యింది. ఆది, సోమ, మంగళవారాల్లో పండుగ సెలవులు ఉండడం, వసూలు లక్ష్యం భారీగా ఉండడంతో ఆయా మునిసిపల్ అధికారులు హైరానాకు గురవుతున్నట్లు తెలుస్తోంది.

- (ఆంధ్రజ్యోతి,భువనగిరి టౌన్)



అంతంత మాత్రంగానే..

ఆస్తి పన్ను వసూళ్లు

- పలు మునిసిపాలిటీలకు పొంచి ఉన్న జీఎస్‌డీపీ ముప్పు
- 9 మునిసిపాలిటీల్లో తగ్గిన ఆస్తి పన్ను డిమాండ్
- రెండు రోజుల్లో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరం

ఆస్తి పన్ను వసూలులో వెనుక బడిన మునిసిపాలిటీలకు గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రాడక్ట్(జీఎస్‌డీపీ) ముప్పు పొంచి ఉంది. పట్టణాల్లో ఆస్తి పన్ను వసూళ్లను పెంచుతూ ఆర్థిక పరిపుష్టి కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం జీఎస్‌డీపీని అమల్లోకి తెచ్చింది. ఈ మేరకు గత ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను వసూళ్లతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 12 శాతం ఆస్తి పన్ను అధికంగా వసూలు చేయాల్సి ఉంటుంది. నిర్ధేశిత 12శాతం అధిక వసూళ్లు చేసే మునిసిపాలిటీలకే ఆర్థిక సంఘం నిధులు మంజూరవుతాయని నిబంధనలు పేర్కొంటున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలోని పలు మునిసిపాలిటీలు జీఎస్‌డీపీ లక్ష్యానికి వెనుకబడి ఆర్థిక సంఘం నిధులకు అర్హత సాధించలేని పరిస్థితి నెలకొంది. ఈ మేరకు జీఎస్‌డీపీ లక్ష్యానికి చేరువ కావాలంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి నల్లగొండలో రూ.6.56కోట్లు, సూర్యాపేటలో రూ.2.73 కోట్లు, నకిరేకల్‌లో రూ.1.17 కోట్లు ఆస్తి పన్ను వసూలు కావాల్సి ఉంది. మరో ఆరు మునిసిపాలిటీల్లో రూ.30 నుంచి 60లక్షల ఆస్తి పన్ను వసూలు కావాల్సి ఉంది. మిగతా మునిసిపాలిటీలు జీఎస్‌డీపీ లక్ష్యానికి చేరువలో ఉండగా ఉమ్మడి జిల్లాలో చిట్యాల మాత్రమే జీఎస్‌డీపీ లక్ష్యాన్ని ఈ పాటికే దాటడం విశేషం. పట్టణాల అభివృద్ధిలో కీలకమైన కేంద్ర ఆర్థిక సంఘం నిధులు రావాలంటే జీఎస్‌డీపీ లక్ష్యాన్ని దాటాల్సిన పరిస్థితి ఉండటంతో వెనుకబడిన మునిసిపాలిటీల అధికారులు క్షేత్రస్థాయిలో ఆస్తి పన్ను వసూలుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని, జరిమానాలో 90 శాతం రాయితీని సద్వినియోగం చేసుకొని ఆస్తిపన్ను బకాయిలను చెల్లించాలని అధికారులు కోరుతున్నారు.

9 మునిసిపాలిటీల్లో తగ్గిన ఆస్తి పన్ను డిమాండ్

పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో పట్టణాల్లో భవన నిర్మాణాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇందుకు అనుగుణంగా ఆస్తి పన్ను డిమాండ్ కూడా పెరగాల్సి ఉంది. కానీ ఉమ్మడి జిల్లాలోని 18 మునిసిపాలిటీలకు గాను 9 మునిసిపాలిటీల్లో గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆస్తి పన్ను డిమాండ్ తగ్గడం మునిసిపల్ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. కనీసం ఆస్తి పన్ను పెరుగకున్నా గత సంవత్సరంతో పోలిస్తే సమానంగా ఉండాలి కానీ తగ్గింది. మిగతా 9 మునిసిపాలిటీలల్లో నామమాత్రంగానే ఆస్తి పన్ను డిమాండ్ పెరిగినట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. ఆస్తి పన్ను డిమాండ్ హెచ్చు తగ్గులకు ఆయా మునిసిపాలిటీల రెవెన్యూ విభాగం పనితీరే కారణమని పలువురు అంటున్నారు. నిర్మించిన ప్రతీ భవనానికి కొలతల ఆధారంగా ఆస్తి పన్ను మదింపు చేస్తే ఊహించని స్థాయిలో ఆస్తి పన్ను డిమాండ్ పెరిగే అవకాశాలు ఉన్నప్పటికీ పలు కారణా



మునిసిపాలిటీ	గత ఆర్థిక సంవత్సరం (కోట్లలో)	ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (కోట్లలో)	డిమాండ్ తేడా (కోట్లలో)	జీఎస్‌డీపీకి కావలసిన వసూళ్లు	శుక్రవారం నాటికి ఆస్తి పన్ను వసూలు శాతం
నల్లగొండ	19.84	15.68	-4.16	రూ. 6.56 కోట్లు	32.06
సూర్యాపేట	12.70	11.51	-1.19	రూ. 2.73 కోట్లు	66.85
నకిరేకల్	2.69	1.85	-0.84	రూ. 1.17 కోట్లు	25.84
మిర్యాలగూడ	9.93	10.15	+0.22	రూ. 98 లక్షలు	45.14
యాదగిరిగుట్ట	2.58	2.02	-0.56	రూ. 87 లక్షలు	61.59
చౌటుప్పల్	5.24	5.02	-0.22	రూ. 85 లక్షలు	67.89
దేవరకొండ	2.47	2.06	-0.41	రూ. 71 లక్షలు	71.33
హుజూర్‌నగర్	2.20	1.85	0.35	రూ. 62 లక్షలు	72.18
కోదాడ	5.04	5.35	+0.31	రూ. 30 లక్షలు	67.4
తిరుమలగిరి	1.10	0.96	-0.14	రూ. 27 లక్షలు	64.29
భువనగిరి	5.49	5.98	+0.50	రూ. 17 లక్షలు	58.42
హాలియా	1.38	1.39	+0.01	రూ. 15 లక్షలు	63.59
ఆలేరు	1.25	1.26	+0.01	రూ. 14 లక్షలు	55.02
నేరేడుచర్ల	0.91	0.90	-0.01	రూ. 12 లక్షలు	77.19
పోచంపల్లి	1.06	1.13	+0.07	రూ. 5 లక్షలు	53.08
చండూరు	0.51	0.55	-0.04	రూ. 2 లక్షలు	79.1
మోత్కూరు	0.92	1.01	+0.09	రూ. 2 లక్షలు	75.04
చిట్యాల	1.18	1.34	+0.16	-	69.83

ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించి.. నిషేధిత జాబితా నుంచి

మినహాయింపు పొందాలి

జి రామలింగం, కమిషనర్, భువనగిరి మునిసిపాలిటీ



ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించి, ప్లాట్లను నిషేధిత జాబితానుంచి తొలగించుకోవాలని భువనగిరి మునిసిపల్ కమిషనర్ జి.రామలింగం అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై అనేక సందేహాలను నివృత్తి చేసేందుకు 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

- (భువనగిరి టౌన్-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: వెంచర్ యజమానుల బ్యాంకు రుణాలు, కోర్టు వివాదాల కారణంగా నిషేధిత జాబితాలో చేర్చిన వెంచర్ల ప్లాట్లకు ఎల్‌ఆర్‌ఎస్ వర్తిస్తుందా..?

కమిషనర్: వెంచర్ల నిషేధిత జాబితాలతో నిమిత్తం లేకుండా ప్లాట్ల నిషేధాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకుంటాం. ఆయా వెంచర్లలోని ప్లాట్లకు కేవలం ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపునకు మునిసిపల్‌కార్యాలయాల్లో నిషేధిత జాబితాల నుంచి మినహాయింపు లభిస్తుంది.ఈతరహా ప్లాట్లకు మునిసిపాలిటీలకు ఇటీవలే తాత్కాలిక డెలిట్ ఆప్షన్ ఇచ్చారు. కానీ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్లాట్ల నెంబర్ల ఆధారంగా నిషేధించి న ప్లాట్ల యజమానులు ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకునిఉంటే ఫీజు చెల్లింపునకు ఆయా శాఖల నుంచి ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: గతంలో కచ్చా లేఅవుట్లలో ప్లాట్ల విక్రయం కొనసాగింది. ఆయా వెంచర్లలో యజమానులు నిబంధనల ప్రకారం 10శాతం ఖాళీ స్థలాలలను స్థానిక సంస్థలకు అప్పగించలేదు. దీంతో ఫీజు చెల్లింపులో దరఖాస్తు దారులు నష్టపోవాల్సి వస్తోంది.

కమిషనర్: గత అనధికారిక లేఅవుట్లలో యజమానులు మునిసిపాలిటీలకు 10శాతం ఖాళీ స్థలాలను అప్పగించకున్నప్పటికీ నేటికీ ఆ స్థలాలు సురక్షితంగా ఉంటే మేము స్వాధీనం చేసుకుంటాం. ఆ వెంచర్లలోని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు దారులకు ఫీజు చెల్లింపులో మినహాయింపు లభిస్తుంది.

ఆంధ్రజ్యోతి: వెంచర్‌లోని 10 శాతం ఖాళీ స్థలాలు ఉన్నప్పటికీ అవగాహన రాహిత్యంతో పలువురు అధిక ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లిస్తున్నారు. కానీ ఆలస్యంగా ఖాళీ స్థలాలు ఉన్నట్లు అధికారికంగా తేలితే చెల్లించిన అధిక ఫీజు తిరిగి ఇస్తారా?

కమిషనర్: ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: గ్రామాలు పట్టణాల్లో ఒకే మాదిరిగా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు ఎలా వసూలు చేస్తారు?

కమిషనర్: ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు విధింపులో గ్రామాలు,పట్టణాలు తేడా ఉండదు. ఆ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న సమయానికి స్టాంప్ వాల్యూపై 14 శాతం ఫీజు, బేసిక్ చార్జీలతో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు లెక్కింపు ఉంటుంది. సహజంగానే గ్రామ భూముల స్టాంప్ డ్యూటీ తక్కువగా, పట్టణ భూముల స్టాంప్ డ్యూటీ ఎక్కువగా ఉంటుంది. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు లెక్కింపులో కూడా అంతే తేడా ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: లాగిన్‌లో చూపెడుతున్న షార్ట్ ఫాల్స్‌పై స్పష్టత కొరవడింది?

కమిషనర్ : ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు సమయంలో జరిగిన పొరపాట్లు, ఆ సర్వే నెంబర్ల ఆధారంగా లాగిన్‌లో షార్ట్ ఫాల్స్‌ను చూపిస్తోంది. చెరువు శిఖం, ప్రభుత్వ, వక్ఫ్, దేవాలయ తదితర భూములను, పక్కనే ఉంటే సర్వే నెంబర్లను కూడా నిషేధిత జాబితాలో చేర్చారు. ఆ భూముల్లోని ప్లాట్లన్నింటికి షార్ట్ ఫాల్స్ ఉంటాయి. అయితే షార్ట్ ఫాల్స్ ఆధారంగా వివరాలను లాగిన్‌లో అప్‌లోడ్ చేసి రెవెన్యూ, ఇరిగేషన్, మునిసిపల్ అధికారులతో కలిసి పరిష్కరించుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి: 2020లో రూ.వెయ్యి చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న ప్లాట్‌ను కొనుగోలు చేసిన వారికి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు కట్టుకోవచ్చునా?

కమిషనర్: ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తుచేసిన ప్లాట్ ఎన్ని చేతులు మారినప్పటికీ ఇప్పుడు ఫీజు కట్టుకొని క్రమబద్ధీకరించుకోవచ్చు. యజమాని పేరుతో కాకుండా ప్లాట్ నెంబర్ ఆధారంగా క్రమబద్ధీకరణ వర్తిస్తుంది.

ఆంధ్రజ్యోతి: వెంచర్లలో 10శాతం భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ సహా ఇతర అధికారులందరూ ఆదేశిస్తున్నప్పటికీ భూముల స్వాధీనంలో ఇందుకు నిర్లక్ష్యం చూపుతున్నారు.

కమిషనర్: అనుమతులు పొందిన వెంచర్లన్నింటిలోనూ 10శాతం భూమిని మునిసిపాలిటీలకు వెంచర్ యజమానులు రిజిస్ట్రేషన్ చేస్తేనే అనుమతులు విడుదల చేస్తాం. ఆ భూమి సురక్షితంగా ఉంటుంది. తరచూ తనిఖీలు కూడా చేస్తుంటాం. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పది శాతం భూముల వివరాలు ఉంటాయి. అయితే అనధికారిక వెంచర్లలో మాత్రం కొద్దిమంది 10శాతం భూమిని అప్పగించడం లేదు. కానీ ప్రస్తుతం అనధికారిక వెంచర్లు ఉండడం లేదు.

ఆంధ్రజ్యోతి: 25 శాతం ఫీజు రాయితీ గడువు ఈ నెల 31తో ముగుస్తున్నందున గడువు పొడగించే అవకాశం ఉందా? ఈ మాసంలోనే ఆదాయ పన్ను చెల్లించాల్సి రావడం, నెల చివరన వరుసగా సెలవులు రావడంతో గడువులోపు ఫీజు చెల్లించలేక పోతున్నారు?

కమిషనర్: గడువు పొడగింపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: ఫీజు విధింపులో ప్లాట్ల విస్తీర్ణంలో తేడాలు ఉంటున్నాయి.

కమిషనర్: అవగాహన రాహిత్యం, హడావుడి తదితర కారణాలతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు సమయంలో ప్లాట్ విస్తీర్ణాన్ని తప్పుగా అప్‌లోడ్ చేసి ఉండవచ్చును. కానీ రికార్డుల ప్రకారం ప్లాట్ విస్తీర్ణం ఆధారంగానే ఫీజు ఉంటుంది.

నేడు హుజూర్‌నగర్‌కు సీఎం రాక

(5వపేజీ తరువాయి)

మంది లబ్ధిదారులను అధికారులు ఎంపికచేశారు. సభా వేదిక మీదే లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. పట్టణంలోని రేషన్‌కార్డు దారులు ధరావత్ బుజ్జీ, కర్ల రాధ, షైలా రజిత, చిరుమామిళ్ల సుశీల, షేక్ కరీమా, రాయంచు మమత, చల్లా సుగుణ, కర్నా వెంకటపుష్ప, సరికొండ ఉమ, మండల పరిధిలోని వేపలసింగారం రేషన్‌షాపు పరిధిలోని చడపంగు లక్ష్మి, భరతం కుమారి, కర్పూరపు లక్ష్మి, మాళోతు రంగా, గుండెనబోయిన గురవమ్మ, షేక్ రహిమాన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రేషన్ బియ్యం పంపిణీ చేస్తారు.

ఆహార భద్రతకు సోనియాగాంధీ పెద్దపీట : మంత్రి ఉత్తమ్

ఆహార భద్రతకు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ పెద్దపీట వేస్తున్నారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎం సభా స్థలాన్ని పరిశీలించిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో లేని సన్న బియ్యం పథకంతో దేశంలోనే విప్లవాత్మక మార్పును తెచ్చేందుకు సోనియా, రాహుల్‌గాంధీ సంకల్పంతో కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3.10కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తామన్నారు. రాష్ట్ర జనాభాలో 84 శాతం ప్రజలకు ఈ పథకం అమలవుతుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 89.73లక్షల తెల్లరేషన్ కార్డు దారులు ఉండగా, 2.8కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. అర్హులైన వారందరికీ కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తామన్నారు. ప్రభుత్వానికి కొత్త కార్డుల కోరం 30లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. త్వరలోనే త్రివర్ణపు రంగులో రేషన్ కార్డులు పంపిణీచేస్తామన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

(ఆంధ్రజ్యోతి, నేరేడుచర్ల): సీఎం సభను విజయవంతం చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం నేరేడుచర్లలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి మండలాల కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెలకు ఒక్కో లబ్ధిదారుడికి 6కిలోలు ఉచితంగా సన్నబియ్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొణతం చినవెంకటరెడ్డి, భూక్యాగోపాల్, నూకల సందీప్‌రెడ్డి, మోతీలాల్, బచ్చలకూరి ప్రకాష్, రాపోలు నర్సయ్య, బెల్లంకొండ నర్సింహారావు, కొణతం చిన సీతారాంరెడ్డి, బైరెడ్డి జితేందర్‌రెడ్డి, సైదులు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఉగాది నుంచి పేదోళ్ల ఇంట ప్రతీరోజు పండుగే

(ఆంధ్రజ్యోతి, కోదాడ): ఉగాది నుంచి పేదోడి ఇంట ప్రతీ రోజు పండుగే అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కోదాడలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల నుంచి ప్రతీ కార్యకర్త స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న, పీసీసీ డెలిగేట్ మెంబర్ చింతల లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మాజీసర్పంచ్ వెంకటరత్నం బాబు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

(ఆంధ్రజ్యోతి, హుజూర్‌నగర్): సీఎం పర్యటన ఏ ర్పాట్లను కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎస్పీ నర్సింహులు పరిశీలించారు. శనివారం పట్టణంలో సీఎం స భా స్థలం, హెలీప్యాడ్, మోడల్ కాలనీ ఇళ్లను పరిశీలించారు. సీఎం పర్యటన సం దర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ఎస్పీ తెలిపారు. 1,500 పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఉద్యోగ సమస్యలపై పోరాటం చేస్తాం

భువనగిరిగంజ్, మార్చి29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తామని టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా టీఎన్‌జీవోస్ కార్యవర్గ సమావేశం స్థానిక వివేరా హోటల్‌లో శనివారం సంఘం జిల్లా అధ్యక్షుడు ధరణికోట భగత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్స్ సంబంధించిన సమస్యల ప రిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులందరికీ 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలన్నారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం టీఎన్‌జీవో ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి 30వరకు జిల్లాల్లో సదస్సులు, స్థాని క, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. మే 4న రాష్ట్ర స్థాయి లో సదస్సు, మే 15న జిల్లా స్థాయిలో నిరసన కార్యక్రమాలు, జూన్ 9న రాష్ట్ర స్థాయిలో మహాధర్నా నిర్వహిస్తునట్లు తెలిపారు. ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఉద్యోగులకు ప్రభుత్వ పరంగా అనేక సౌకర్యాలు టీఎన్‌జీవో ద్వారా సాధించినట్లు చెప్పారు. సమా వేశంలో టీఎన్‌జీవోల సంఘం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, టీఎన్‌జీవో అధ్యక్షుడు జగన్‌మోహన్, కార్యదర్శి ఎండీ ఖదీర్, కోశాధికారి శ్రీకాంత్, పి. శ్రీనివాస్, శశికాంత్, ఇంద్రసేనరెడ్డి, శైలజ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలపై బీజేపీ పోరుబాట

- చేయూత, మహాలక్ష్మి పథకాల కోసం దరఖాస్తుల స్వీకరణ
- పథకాల అమలుకు అర్హుల నుంచి సీఎంకి దరఖాస్తులు
- హామీల అమలుకు ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.మనోహర్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 29(ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి బలమైన పక్షంగా నిలవాలనే సంకల్పంతో బీజేపీ అడుగులేస్తోంది. సంస్థాగతంగా పటిష్ఠమైన నిర్మాణాన్ని ఇటీవలే పూర్తిచేసుకున్న పార్టీ, ఇకపై క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై పోరాటాలు, ఉద్యమాలు చేపట్టాలని నిర్ణయించింది. ప్రధానంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడంతో పాటు, క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలపై ఉద్యమించాలని నిర్ణయించింది. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రధాన హామీలైన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలనే డిమాండ్‌తో ప్రజల నుంచే దరఖాస్తులు స్వీకరించి, అధికారులకు అందజేసి ప్రభుత్వాన్ని హామీలపై నిలదీయాలని నిర్ణయించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ఈ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను మునుగోడు నియోజకవర్గంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గొంగిడి మనోహర్‌రెడ్డి నేతృత్వంలో ఉధృతంగా కొనసాగిస్తుండటంతో రాజకీయంగానూ వాడివేడిచర్చకు దారితీసింది.

పథకాల అమలు కోసం సీఎం పేరున దరఖాస్తుల స్వీకరణ


కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు బీజేపీ ఉద్యమిస్తోంది. ఆరు గ్యారెంటీల్లో ప్రధానమైన చేయూత, మహాలక్ష్మి పథకాలను ఏడాది కాలం గడిచిపోయినా అమలు చేయలేదని, తక్షణం వాటిని అమలు చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి లబ్ధిదారులతో దరఖాస్తులు రాయిస్తున్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా చేయూత పథకం కింద వృద్ధులకు ఇచ్చే పింఛన్‌ని రూ.2500 నుంచి రూ.4వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అదే విధంగా మహాలక్ష్మి పథకం కింద ప్రతీ మహిళకు నెలకు రూ.2500 ఇస్తామని పేర్కొనగా, ఈ రెండు పథకాలు ఇప్పటికీ అమలుకానందున వాటిని తక్షణం అమలుచేయాలని కోరుతూ ఈ దరఖాస్తులను బీజేపీ స్వీకరిస్తోంది. అన్ని నియోజకవర్గాల్లో ఈ నెల 26వ తేదీ నుంచి నెలాఖరువరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఏప్రిల్ మొదటివారంలో తహసీల్దార్ కార్యాలయాల్లో ధర్నాలు నిర్వహించి లబ్ధిదారుల డిమాండ్లు వివరిస్తామని, అదేవిధంగా ఎమ్మెల్యేలు, ఎంపీలను కలిసి వినతిపత్రాలు ఇవ్వాలని, కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేసి ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేయాలని పార్టీ నిర్ణయించింది.



లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి

ఆరు గ్యారెంటీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం

- డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



అసెంబ్లీ ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల హామీలిచ్చింది. పింఛన్ రూ.2500 నుంచి 4వేలకు పెంచుతామని, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2500ఇస్తామని పేర్కొంది. అంతేకాకుం డా ఆడబిడ్డ పెళ్లికి కానుకగా తులం బంగా రం ఇస్తామని పేర్కొంది. ఈ హామీలతో ఎన్నికల్లో గెలిచి గద్దెనెక్కాక వాటిని అమలు చేయకుండా ప్రభుత్వం తప్పించుకుంటుంది. హామీలు అమలు చేయాలని అర్హులైన వారి నుంచి ప్రభుత్వానికి దరఖాస్తులు ఇప్పించే కార్యక్రమాన్ని బీజేపీ తరుపున చేపడితే అధిక సంఖ్యలో అర్హులు స్వచ్ఛందంగా వచ్చి దరఖాస్తులు ఇస్తు న్నారు. మునుగోడు నియోజకవర్గంలోనే ఇప్పటివరకు దాదాపు 30వేల దరఖాస్తులు వచ్చాయి. ఈ రెండు రోజుల్లో ఇంకో 20వేల దరఖాస్తులు వస్తాయి. హామీల అమలు కోసం ప్రజల తరపున ప్రభుత్వంపై పోరాడుతాం. ఆరు గ్యారంటీలే కాకుండా రుణమాఫీ కూడా సక్రమంగా అమలు చేయలేదు. కాలయాపన చేస్తున్న విషయాన్ని ప్రజాక్షేత్రంలో బీజేపీ తరుపున ఎండగడతాం.

ఊరిస్తున్న పదవి వరించేనా?

(5వపేజీ తరువాయి)

కల్పించాలని కోరడం, రాజగోపాల్‌కు క్యాబినెట్ బెర్త్ ఇవ్వడానికి అధిష్ఠానం కసరత్తు చేస్తోందని తెలుస్తోంది. 2009లో భువనగిరి ఎంపీగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన రాజగోపాల్‌రెడ్డి, ఆ తర్వాత స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందారు. 2018లో మునుగోడు ఎమ్మెల్యేగా గెలుపొందగా, బీజేపీలో చేరాక ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, 2022లో ఉప ఎన్నిక ఎదుర్కొని ఓటమిపాలయ్యారు. కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపుమేరకు అసెంబ్లీ ఎన్నికలకు ముందు తిరిగి కాంగ్రెస్‌లో చేరి 2023లో మళ్లీ ఎమ్మెల్యేగా గెలుపొందారు.

లంబాడ సామాజికవర్గం నుంచి ఛాన్స్ ఉంటుందనే ఆశలో బాలూనాయక్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కీలకంగా ఉపయోగపడిన గిరిజన లంబాడ సామాజికవర్గం నుంచి మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని, డిప్యూటీ స్పీకర్ ఇతర పదవులతో సరిపుచ్చితే కుదరదని ఇటీవల అసెంబ్లీ లాబీల్లో దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ వ్యాఖ్యానించారు. అంతేగాక బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో లంబాడీలకు మంత్రివర్గంలో అవకాశమిచ్చారని, అన్ని విధాలా ప్రాధాన్యం కూడా ఇచ్చారని, అయినా లంబాడీలు గడచిన ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌కే అనుకూలంగా ఓట్లేసి గెలుపునకు దోహదపడ్డారని ఆయన వివరించారు. రాజకీయ సంచలనాన్ని సృష్టించిన ఈ వ్యాఖ్యలు బాలూనాయక్ మంత్రి పదవికి బలంగా ప్రయత్నిస్తున్న విషయాన్ని తెలియజేస్తోంది. దేవరకొండ నియోజకవర్గం నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన బాలునాయక్, ఒక పర్యాయం ఉమ్మడి నల్లగొండ జిల్లాకు జడ్పీ చైర్మన్‌గానూ పనిచేశారు. క్యాబినెట్‌లో ప్రస్తుతం ఎస్టీ వర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీతక్క ఆదివాసీ వర్గానికి చెందినవారవడంతో, లంబాడీ వర్గానికి అవకాశమివ్వాలని ఆ వర్గ ఎమ్మెల్యేలు తాజాగా కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రాలు కూడా అందజేశారు. ఒక దశలో డిప్యూటీ స్పీకర్ పదవి బాలూనాయక్‌కు వరిస్తుందనే చర్చ జోరుగా సాగగా, తాజాగా ఈ సామాజికవర్గ ఎమ్మెల్యేలు మంత్రి పదవికే పట్టుబడుతుండటంతో అధిష్ఠానం ఎలా స్పందిస్తుంది? ఈ సామాజికవర్గ ఎమ్మెల్యేలు, నేతలను ఎలా సంతృప్తిపరుస్తుందనే అంశంపై ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం అసెంబ్లీలో కాంగ్రెస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న లంబాడీ సామాజికవర్గ ఎమ్మెల్యేల్లో బాలునాయక్ సీనియర్ కావడంతో మంత్రిపదవైనా, ఇతర సమాన పదవి ఏదైనా ఆయనకే వరిస్తుందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. మొత్తానికి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల్లో ఈ క్యాబినెట్ విస్తరణలో ఎవరికి, ఎలాంటి అవకాశం దక్కనుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

ప్రీమియర్ కంపెనీలో బీఆర్ఎస్‌కేవీ హ్యాట్రిక్



విజయోత్సవ ర్యాలీలో మాట్లాడుతున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్, మార్చి 29, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దకందుకూర్ ప్రీమియర్ ఎక్స్‌ప్లోజీవ్స్ కంపెనీలో బీఆర్ఎస్‌కేవీ మూడోసారి హ్యాట్రిక్ విజయం సాధించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో కంపెనీ బీఆర్ఎస్‌కేవీ గౌరవ అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆరేళ్ల క్రితం కంపెనీ స్థాపించిన తర్వాత రెండుసార్లు స్వతంత్రంగా మూడోసారి బీఎంఎస్ మద్దతుతో బీఆర్ఎస్‌కేవీ సీఐటీయూపై 30ఓట్లతో గెలిపొందినట్లు చెప్పారు. కంపెనీలో మొత్తం 390 ఓట్లు ఉండగా అందులో బీఆర్ఎస్‌కేవీకి 209, సీఐటీయూ 179, హెచ్ఎంఎస్ 1, బీఎంఎస్ వచ్చాయని ఆయన వివరించారు. ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలు తప్పకుండా నెవేరుస్తామని 12వ వేతన ఒప్పందం చేసే ముందుకు బీఆర్ఎస్‌కేవీ, బీఎంఎస్ నాయకులు కలిసి కార్మికులతో ముందుగా చర్చించి యాజమాన్యంతో పలు దఫాలుగా చర్చించి కార్మికులకు అనుకూలంగా ఉండే విధంగా వేతన ఒప్పందం చేస్తామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కార్మికులకు ఫోన్లు చేసి స్వయంగా మాట్లాడి చెప్పినప్పటికీ కార్మికులు బీఆర్ఎస్‌కేవీకి మద్దతు పలికారన్నారు. కార్మికులు బీఆర్ఎస్‌కేవీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి బరిగె నర్సింహులు, బీఎంఎస్ నాయకులు నాగేందర్‌రెడ్డి, జలేందర్‌గౌడ్, వై. రాజిరెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, నాయకులు గుండ్లపల్లి వెంకటేష్‌గౌడ్, సీస రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

CLASSIFIEDS

ప్లాట్లు అమ్మబడును

★ కోదాడ టౌన్ సింగారం రోడ్డు లక్ష్మయ్య గారి తోట ప్రక్కన సింగారం మెయిన్ రోడ్ ఫేసింగ్ పడమర, దక్షిణం ఫ్లాట్ 521, చ॥గ॥ తూర్పు, దక్షిణం ఫేస్ ఫ్లాట్ 246 చ॥గ॥ అమ్మబడును. సెల్ : 9848951551

AJY_224202

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED

NLG+SRPT+YGT (3Dist)

210/- Only

Extra Line 45/- Only

For Ads Contact :

NALGONDA DIST
9985413365
9985413656

SURYAPET DIST
9703618713,
9985401015

YADADRI BHONGIRI DIST
9985410384

మర్రిగూడలో ఇఫ్తార్ విందు

మర్రిగూడ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ముస్లింల పర్వదినం సందర్భంగా శనివారం రెవెన్యూ కార్యాలయం ఆధ్వర్యంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బక్క శ్రీనివాస్ మాట్లాడుతూ రంజాన్ పండుగ ముస్లిం సోదరులకు గొప్పదని ఆయన అన్నారు. ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మత పెద్దలు జఫార్, యాసిన్, యూసుఫ్, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల పోరుగర్జన సభను విజయవంతం చేయాలి

మునుగోడురూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఏప్రిల్ 2న ఢిల్లీలో నిర్వహించనున్న బీసీల పోరుగర్జన సభ విజయవంతం చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి కృష్ణ పిలుపునిచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీలో బీసీలకు 42 శాతం పెంచుతూ చేసిన చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు ఎవరికి ఇచ్చే భిక్ష కాదని అన్నారు.

సంక్షేమ పథకాలఅమలులో విఫలం

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి



బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గంగిడి మనోహర్‌రెడ్డి

మర్రిగూడ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు అమలుచేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. బీజేపీ కార్యకర్తలు గ్రామాల్లోకి వెళ్లి కేంద్రంలో మోదీ అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 15 నెలలు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండు తోడు దొంగలేనని వారికి ప్రజలే తగిన సమయంలో గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. బీజేపీ కార్యకర్తలు ప్రజలను ప్రశ్నించే విధంగా చైతన్యపరచాలని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురవేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బూరెల బిక్షంగౌడ్, యాస అమరేందర్‌రెడ్డి, పిట్టల శ్రీనివాస్, పందుల రాములుగౌడ్, శ్రీనివాసరావు, యాదగిరి, పరశురాం, శోభన్‌బాబు, రాజు, మల్లేష్, యాదగిరి పాల్గొన్నారు.

ఏప్రిల్ 25 నాటికి ఎస్టీపీ పనులను పూర్తిచేయాలి

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

● నల్లగొండ పట్టణంలో మంత్రి సుడిగాలి పర్యటన

నల్లగొండటౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): నల్లగొండ సమీపంలోని శేషమ్మగూడెం వద్ద చేపట్టిన సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను వచ్చే నెల 25వ తేదీన నాటికి పూర్తిచేయాలని అధికారులను రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా కేంద్రంలో శనివారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం ఎన్‌జీ కాలేజీలో మార్నింగ్ వాకింగ్‌తో ప్రారంభమైన మంత్రి పర్యటన వివిధ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగింది. రామాలయం వద్ద రోడ్డు పక్కన ఇడ్లీ బండి వద్ద అల్పాహారం చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నాడు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి శేషమ్మగూడెం కలిసి సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. 2014లో రూ.38 కోట్ల రూపాయలతో ఈ సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ మంజూరైనా ఇప్పటి వరకు పనులు పూర్తి కాకపోవడం బాధాకరమని అన్నారు. పట్టణంలో దాదాపు 80 శాతం ఇళ్ల ఎస్టీపీ కనెక్షన్లు కలిగి ఉన్నట్లు తెలిపారు. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పూర్తి చేయడంతో పాటు, చుట్టూ గార్డెన్ ఏర్పాటు చేయాలని, మొక్కలు నాటించాలని, టైల్స్, పెయింటింగ్ వంటి వాటన్నింటినీ ఏర్పాటు చేయాలన్నారు. నర్సప్పగూడ వద్ద అధునాతన


అధికారులకు సూచలను చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టనున్న మరో ఎస్టీపీ నిర్మాణానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎలాంటి పనులను తాము చేపట్టబోమని ఆయన స్పష్టం చేశారు. పట్టణ కేంద్రం నడిబొడ్డున ఉన్న ఎన్జీ కళాశాల మైదానంలో హరితహారం మొక్కలు నాటించాలని, గార్డెన్ ఏర్పాటు చేయాలని, ఫ్లైఓవర్లకు పెయింటింగ్ వేయించాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి ఛాయా సోమేశ్వర దేవాలయం వెనక వైపు ఉన్న డ్రై సింగ్ కుంట రోడ్డును, అక్కడ ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. మహాశివరాత్రి సందర్భంగా పచ్చల సోమేశ్వరస్వామి దేవాలయానికి వచ్చే వాహనాల పార్కింగ్ అభివృద్ధికి స్థలాన్ని పరిశీలించారు. మంత్రి వెంట కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ అధికారులు, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఉన్నారు.

విశ్వవిద్యాలయ అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ

నల్లగొండ: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం యూనివర్సిటీని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను బడ్జెట్‌గా మార్చుకు, కొత్త కోర్సులు ప్రవేశపెట్టడానికి ప్రణాళికలు అందించాలన్నారు. ఉత్తమ పరిశోధనలు జరగాలని విశ్వవిద్యాలయ అభివృద్ధికి మరిన్ని ప్రణాళికలతో ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు ఐక్యూఏసీ డైరెక్టర్ మిర్యాల రమేష్, వై.ప్రశాంతి, ఆకుల రవి, అంజిరెడ్డి, ప్రేమ్‌సాగర్, సుధారాణి, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



















కాంగ్రెస్ అణగారిన వర్గాల పార్టీ

● రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీపై ఉంది

● ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

నల్లగొండటౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్ర సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్‌గాంధీ జై బాపు, జై భీమ్, సంవిధాన్ కార్యక్రమాన్ని తీసుకు వచ్చినట్లు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ ఆనాడు అణగారిన వర్గాలకు రిజర్వేషన్, రాజకీయ ప్రాముఖ్యత కల్పించారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ స్వాతంత్ర్య సమరయోధులను, రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతలను అవమానిస్తోందని ఆరోపించారు. మోదీ, అమిత్‌షా భారత రాజ్యాంగాన్ని అవమానపరిచే విధంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతతత్వంతో పాలన సాగిస్తే ప్రజల భవిష్యత్తుకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అణగారిన వర్గాలు, అన్ని వర్గాల సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ నినాదంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించాలని కోరారు. సీడ్ కార్పొరేషన్ చైర్మన్, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు. మతతత్వంతో పాలన సాగిస్తున్న పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ చైర్మన్ మల్లాది పవన్, కో ఆర్డినేటర్ శత్రు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే దేశానికి స్వాతంత్రం వచ్చిందని, కాంగ్రెస్ పార్టీ వల్లే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సంజీవ్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి, మాజీ ఎంపీపీ పోలగోని సత్యం, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

● మండలి చైర్మన్ గుత్తా

నల్లగొండ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేద ప్రజలకు వరం లాంటిదని పార్టీలకతీతంగా సీఎంఆర్ ఇవ్వడం హర్షించదగిన విషయమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం రూ. 13.66 లక్షల విలువైన చెక్కులను 41 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా సీఎం సహాయ నిధి నుంచి వెయ్యి కోట్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఆసరాగా నిలుస్తుందన్నారు.

వర్చువల్‌గా పల్లెదవాఖానా మూల్యాంకనం

నార్కట్‌పల్లి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో భాగంగా నార్కట్‌పల్లి మండలంలోని మాదవఎడవల్లి ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాపై జాతీయ నాణ్యత మూల్యాంకన (ఎన్‌క్యూఏఎస్)లో భాగంగా మూల్యాంకనం చేసే బృందం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా పరిశీలించింది. ఎం.ఎడవల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ద్వారా అందిస్తున్న ఆరోగ్య సేవలను తెలుసుకున్నారు. అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. పల్లె దవాఖానా పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది ఏఎన్ఎం, ఆశ వర్కర్ల వివరాలు, వారి విధులు బాధ్యతలు తెలుసుకున్నారు. రోజువారీగా వస్తున్న రోగుల సంఖ్య మాతా శిశువుల మొదలు వయోవృద్ధులకు గల ఆరోగ్య సమస్యలు చికిత్స విధానం, అందిస్తున్న ఔషధాలతో పాటు 9రకాల ఆరోగ్య కార్యక్రమాల అమలుతీరును వర్చువల్‌గా తెలుసుకున్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఆరోగ్య పథకాల ప్రచార పోస్టర్లు, కేంద్రంలో ఉన్న వనరులు, భవనాన్ని వారు వర్చువల్‌గా వీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్ రెడ్డి, నార్కట్‌పల్లి పీహెచ్‌సీ ఎంవో విజయ్‌కుమార్ ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : వీరేశం


గుడివాడలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కేతేపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం మండలంలోని గుడివాడలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటడం ద్వారా ప్రతీ ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని చాటాలని క్రీడాకారులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ ఎస్కే లతీఫ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు వీరన్న, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవం చాటిన ఎన్టీఆర్


నల్లగొండలో టీడీపీ జెండాను ఎగురవేస్తున్న శేఖర్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటారని ఆ పార్టీ నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి కేక్‌ను కట్ చేవారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. అనంతరం హైదరాబాద్ రోడ్డులోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల సమర్పించి నివాళులర్పించిన అనంతరం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తుమ్మల మధుసూదన్‌రెడ్డి, ఎల్వీ యాదవ్ ,ఆకునూరి సత్యనారాయణ, తేలు రవి పాల్గొన్నారు.

మర్రిగూడ, నార్కట్‌పల్లి, మనుగోడు, చిట్యాల రూరల్ : చిట్యాల మండలం వెలిమినేడు మర్రిగూడ, నార్కట్‌పల్లి, మనుగోడు మండల కేంద్రాల్లో టీడీపీ జెండాను ఎగురు వేశారు. పలు ప్రాంతాల్లో సేవ కార్యక్రమాలు నిర్వహించారు. మర్రిగూడలో మండలాధ్యక్షుడు దోమల వెంకన్న ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నార్కట్‌పల్లి పట్టణంలో అనాథాశ్రమంలో అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రుద్రవరం యాదగిరి, లింగాల యాదయ్య, చింత లక్ష్మణ్, చెన్నారపు సత్తయ్య, పాల్గొన్నారు. మునుగోడులో ఎన్టీఆర్ చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో గోసుకొండ వెంకటేష్ పాల్గొన్నారు. వెలిమినేడులో పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో లొడె సైదులుగౌడ్, చిరంజీవి, గోపాల్, విష్ణు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష పుష్పార్చన

నార్కట్‌పల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంపై శనివారం లక్ష పుష్పార్చన మహోత్సవం ఘనంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గర్భాలయం నుంచి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య మహామంటపానికి చేర్చారు. ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సహార్చకులు సతీష్‌శర్మ, సురేష్‌శర్మ, శ్రీకాంత్ శర్మలతో పుష్పాలకు పూజాధికాలు నిర్వహించి ఉత్సవ మూర్తులను అభిషేకించారు. స్వామి పాదాల చెంత పూజలనందుకున్న పుష్పాలను తీసుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. స్వామి వారి పుష్కరిణిలో స్నానమాచరించి భక్తులు పార్వతీ జడల రామలింగేశ్వరునితో పాటు గుట్టపైన ఉన్న ఉపాలయాలు, గుట్ట కింద ఉన్న పార్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు.

నష్టపరిహారం అందించాలి

మర్రిగూడ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎండిపోయిన పంట పొలాలను గుర్తించి నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముద్దం శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ వరి పంట చేతికొచ్చే సమయంలోనే భూగర్భజలాలు అడుగంటి పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. మండలంలో ప్రస్తుతం 400 ఎకరాలు ఎండిపోయినట్లు తెలిపారు. ప్రభుత్వం వ్యవసాయ అధికారులతో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి రైతులను గుర్తించి వారికి నష్టపరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో పుష్పాల యాదయ్య, అంజయ్య, నర్సోజీ, యాదగిరి, రవి, పాల్వాయి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

తిప్పర్తి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ ఎంతో ముఖ్యమైనదని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తండు నర్సింహగౌడ్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలో నివసిస్తున్న సుమారు 90 కుటుంబాలకు ఆయన తోఫాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో రంజాన్ మాసాన్ని నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నాయకులు లక్ష్మయ్య, శ్రీను, నాగరాజు, పాల్గొన్నారు.

ఆస్తులు, అంతస్థులు సంపాదించలేరు

నార్కట్‌పల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పని చేసే ఉద్యోగులు ఆస్తులు, అంతస్తులు సంపాదించలేదని, కానీ అపారమైన జీవితానుభవాన్ని పొందే అవకాశం ఉందని టీ జీఆర్టీసీ నల్లగొండ ఆర్ఎం జాన్‌రెడ్డి అన్నారు. నార్కట్‌పల్లి డిపో ట్రాఫిక్ సూపర్‌వైజర్ ఎంవీ చారి స్వీయరచన 'నేనెరిగిన నిజం' మంచిమాటల సంకలన పుస్తకావిష్కరణ, భద్రాచలం దేవస్థానం రామయ్య తలంబ్రాల బియ్యం అందజేసే కార్యక్రమ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. శాటిలైట్ డిపోగా కొనసాగుతున్న నార్కట్‌పల్లి డిపోకు త్వరలో కొన్ని బస్సులను కేటాయిస్తామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం బీంరెడ్డి, డీఎం శ్రీనాథ్, యూనియన్ నాయకులు రాజిరెడ్డి, ఎంపీడీవో ఉమేష్‌చారి పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలులో విఫలం

మునుగోడురూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. శనివారం మునుగోడు మండలంలోకి కల్వకుంట్ల గ్రామం లో ప్రభుత్వం ఆరు గ్యారెంటీలపై అమలుపై ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి తీసుకున్న దరఖాస్తులను తహసీల్దార్లు, కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు భవనం మధుసూదన్‌రెడ్డి, కల్వకుంట్ల మాజీ సర్పంచ్ పగిళ్ల బిక్షం, పిన్నింటి నరేందర్‌రెడ్డి, బొబ్బిలి యాదయ్య, గాలయ్య, మాదవరెడ్డి, మల్లేష్, యాదయ్య, రమేష్ పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

చిట్యాల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): చిట్యాల కనకదుర్గ ఆలయ హుండీని శనివారం లెక్కించారు. దేవాదాయ శాఖ పరిశీలకురాలు సుమతి, ఆలయ మేనేజర్ అంబటి నాగిరెడ్డి పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. ఆలయంలోని ఐదు హుండీలను లెక్కించగా రూ. 87,660 నగదు వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ మారగోని ఆంజనేయులు, డైరెక్టర్లు బుద్ద విమల, గంజి వెంకటేశం పాల్గొన్నారు.

అవార్డులు అందించడం అభినందనీయం

నల్లగొండ టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిని గుర్తించి అవార్డులు అందచేయడం అభినందనీయమని మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ అన్నారు. విశ్వవసు నామ ఉగాది 2025-26ను పురస్కరించుకొని పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో గల సుంకరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలువురు ప్రముఖులు, మేధావులు, సంఘ సేవకులకు వరుసగా ఆత్మీయ సత్కారం నిర్వహించారు. వరుసగా ఏడేళ్ల నుంచి ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సుంకరి ఫౌండేషన్ చైర్మన్ సుంకరి మల్లేష్‌గౌడ్ కళావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కవులు, కళాకారులు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.105	170	200
నల్లగొండ	రూ.110	180	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.5 । కనిష్ఠం 22.4

నేడు హుజూర్‌నగర్‌కు
సీఎం రాక

- ఉగాది పండుగ వేళ పేదలకు సన్నబియ్యం
- ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- 50వేల మందితో బహిరంగ సభ



హుజూర్‌నగర్‌లో సీఎం సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్

హుజూర్‌నగర్,మార్చి 29(ఆంధ్రజ్యోతి):తెలుగు కొత్తసంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా పేదలకు సన్నబియ్యం పథకాన్ని హుజూర్‌నగర్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. పౌరసరఫరాలశాఖ మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొంత నియోజకవర్గం హుజూర్‌నగర్‌లో ఆదివారం సాయంత్రం ఈపథకాన్ని ప్రారంభించనున్నారు. రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ అవుతున్న దొడ్డు బియ్యం పక్కదారి పడుతోందని,కిలో రూ.40వెచ్చించి పేదలకు అందిస్తుంటే రూ.5నుంచి రూ.10లకే దళారులకుచేరుతోందని ప్రభుత్వం గుర్తించింది. దీంతో సన్నబియ్యం పథకానికి ప్రభుత్వం రూపకల్పన చేసి హుజూర్‌నగర్‌లో ప్రారంభించనుంది.

సీఎం పర్యటన ఇలా..

సీఎం సభను హుజూర్‌నగర్ పట్టణంలో ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సాయంత్రం 5గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరి 5.45గంటలకు హుజూర్‌నగర్‌లోని ఫణిగిరి గట్టు మీద ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ వద్ద దిగుతారు. అక్కడ నిర్మాణంలో ఉన్న 2,160 మోడల్ కాలనీ ఇళ్లను పరిశీలించి 6.05గంటలకు హెలీకాప్టర్‌లో బయల్దేరి 6.15 గంటలకు రాజీవ్‌గాంధీ సభా ప్రాంగణానికి చేరుకుంటారు. 6.15 నుంచి 7.30గంటల వరకు నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారు. సభ అనంతరం 7.30 గంటలకు సీఎం హుజూర్‌నగర్ నుంచి రోడ్డు మార్గం గుండా బయలుదేరి కోదాడ మీదుగా 9.45గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు.

సీఎం నుంచి సన్న బియ్యం అందుకునే లబ్ధిదారులు వీరే..


సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సన్నబియ్యం పంపిణీకి 15...

- మిగతా 7వ పేజీలో...

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:35 (ఆదివారం సాయంత్రం)

ఊరిస్తున్న పదవి
వరించేనా?



- క్యాబినెట్ విస్తరణపై జిల్లా ఎమ్మెల్యేల ఆశలు
- రాజగోపాల్‌రెడ్డికి ఛాన్స్ ఖాయమంటున్న కాంగ్రెస్ వర్గాలు
- అవకాశం దక్కుతుందనే విశ్వాసంలో బాలూనాయక్
- కొత్త ఏడాది ఉమ్మడి జిల్లాకు మరో క్యాబినెట్ పదవి వస్తుందనే ఆశాభావం

నూతన తెలుగు సంవత్సరాది కానుకగా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు మూడో క్యాబినెట్ పదవి దక్కుతుందనే ఆశాభావం కాంగ్రెస్ నేతల శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. ఉగాది, రంజాన్ పండుగలు ముగియగానే క్యాబినెట్ విస్తరణ ఉంటుందనే సంకేతాలతో ఉత్కంఠ కొనసాగుతోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ మంత్రి పదవి కోసం ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగించడంతో బెర్తు ఎవరికి దక్కుతుందనే ఆసక్తి నెలకొంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జిగా మీనాక్షి నటరాజన్ బాధ్యతలు తీసుకున్న తరువాత పార్టీ అధికారంలోకి రావడానికి దోహదపడ్డ నాయకుల జాబితా తెప్పించుకోవడం, గడచిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భాల్లో అధిష్ఠానం ఇచ్చిన హామీల అమలుకు కార్యాచరణ అమలులోకి తేవడం ప్రారంభించారు. అందులో భాగంగానే ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్‌కు అవకాశం దక్కింది. అదే ఒరవడిలో తాజా క్యాబినెట్ విస్తరణ ఉండనుందని, ఏదైనా సమీకరణాల్లో క్యాబినెట్‌లో అవకాశం కల్పించలేకపోయిన నేతలకు సమానస్థాయి పదవులు ఇప్పించేందుకు అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది.

హామీ మేరకు మంత్రి పదవి దక్కుతుందన్న నమ్మకంలో రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి విస్తరణలో మంత్రిపదవి దక్కుతుందనే చర్చ బలంగా సాగుతోంది. ఆయన బీజేపీ నుంచి తిరిగి కాంగ్రెస్‌లో చేరిన సందర్భంలో, అదేవిధంగా గడచిన లోక్‌సభ ఎన్నికల సందర్భంలో అధిష్ఠానవర్గం ఆయనకు మంత్రి పదవి ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిందని, దాన్ని నెరవేర్చేక్రమంలో తనకు మంత్రిపదవి వస్తుందనే ధీమాలో రాజగోపాల్‌రెడ్డి ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రాజగోపాల్‌రెడ్డి ఇంటికి వెళ్లి మరీ ఎన్నికల ప్రచార బాధ్యతలు తీసుకొని భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఆ ఎన్నికలో లోక్‌సభ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు, అభ్యర్థి గెలుపునకు రాజగోపాల్‌రెడ్డి కృషిచేశారని ఫలితాల అనంతరం పార్టీ ముఖ్యనేతలు ప్రకటించారు. ఇటీవల ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సైతం రాజగోపాల్‌రెడ్డికి మంత్రివర్గ విస్తరణలో చోటు..

- మిగతా 7వ పేజీలో...



నల్లగొండ పట్టణంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం సుడిగాలి పర్యటన చేశారు. ఎన్జీ కళాశాలలో మార్నింగ్ వాక్‌చేసి కళాశాల బయట ఉన్న ఓ బండి వద్ద ఇలా అల్పాహారం చేశారు. ●8లో..



షడ్రుచుల మేళవింపు
ఉగాది

నేడు శ్రీవిశ్వావసునామ సంవత్సరం
ప్రత్యేక పూజలకు సిద్ధమైన ఆలయాలు

తెలుగు నూతన సంవత్సరం... శ్రీవిశ్వావసు నామ ఉగాదికి సర్వం సిద్ధమైంది. ఆదివారం నుంచి ప్రారంభం కానున్న నూతన సంవత్సరం తొలిరోజు ఆలయాల్లో పూజలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం వేద పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు. జీవితాన్ని ప్రతిబింబించే తీపి, పులుపు, చేదుతో కూడిన ఉగాది పచ్చడి, భక్షాలు ప్రతీ ఇంట గుమగుమలాడనున్నాయి. మట్టి కుండలు, వేప కొమ్మలు, మామిడాకులు, పూజా సామగ్రి కొనుగోళ్లతో జిల్లా కేంద్రం సహా అంతటా సందడి నెలకొన్నది.

6లో..

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...

అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !

పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.

సంప్రదించగలరు :
మిర్యాలగూడ, దేవరకొండ, హాలియా
ACM - 9985411394
Miryalguda ACO- 9963624250, Miryalguda SR - 9542690885,
Devarkonda SR - 9392062350, Haliya SR - 9885226544



మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు

దేవరకొండ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు చేపడుతామని దేవరకొండ ఏఎస్పీ మౌనిక అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం రోడ్లపై వాహనాలు నడుపుతున్న మైనర్లు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో దేవర కొండ సీఐ నర్సింహులు, ఎస్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఆస్తి పన్ను వసూళ్లకు ప్రత్యేక కౌంటర్

మిర్యాలగూడ, దేవరకొండ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఈనెల 30, 31 తేదీల్లో సెలవు దినాలు అయిన ప్పటికి ఆస్తి పన్నుల వసూళ్ల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు మునిసిపల్ కమిషనర్లు మహ్మద్ యూసుఫ్, సుదర్శన్ శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈనెల 30న ఉగాది, 31న రంజాన్ సెలవు దినాలు అయినప్పటికీ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి పన్ను చెల్లించే ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు సన్మానం



ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

మిర్యాలగూడ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ఎన్నికైన శంకర్ నాయ క్‌ను గిరిజనేతలు శనివారం సన్మానించారు. సీపీఐ మండల నాయకులు ధీరావత్ లింగానాయక్, పోలేపల్లి ఉదయ్‌కుమార్ మిర్యాలగూడలోని శంకర్‌నాయక్ నివాసంలో కలిసి శాలువా, గిరిజన సంప్రదాయ కండువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్ల పాటు ప్రజలతో మమేకమై పేదల పక్షాన నిలబడి రాజకీయ ఆటుపోటులు ఎదుర్కొన్న శంకర్‌నాయక్‌కు ఎమ్మెల్సీ పదవి దక్కడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ధీరావత్ వాగ్యానాయక్, అజ్మీరా రాజు, జమ్ముల కోటయ్య, నాగయ్య, సైదులు తదితరులున్నారు.

● కొండమల్లేపల్లి : ఎమ్మెల్సీగా ఎన్నికైన కేతావత్ శంకర్‌నాయక్‌ను శనివారం ఆయన స్వగృహంలో కాంగ్రెస్ కొండమల్లేపల్లి మండలాధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. ఆయన వెంట మంగ్యా నాయక్ తదితరులున్నారు.

ఎండుతున్న మొక్కలు

» ఏడాది నుంచి మంజూరు కాని నిధులు
» కొరవడిన అధికారుల పర్యవేక్షణ

పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రభు త్వం ప్రతి ఏడాది జూన్, జూలై మాసాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతోంది. అయితే గ్రామ పంచాయతీలు, ఖాళీ ప్రదేశాలు, రహదారులకు ఇరు వైపులా, నర్సరీల్లో మొక్కలు నాటేందుకు వాటిన సంరక్షించేందుకు రూ.లక్షల ఖర్చు చేస్తోంది. కానీ వాటి సంరక్షణ కరవువడంతో మొక్కలు నిలువునా ఎండి పోతున్నాయి.
(ఆంధ్రజ్యోతి-డిండి)



ప్రతాప్‌నగర్ గ్రామ పంచాయతీలో మొక్కలులేని పల్లె ప్రకృతివనం



డిండిలో నీరులేక ఎండిపోయిన మొక్క

మొక్కలునాటే కార్యక్రమం ప్రభుత్వం పదేళ్లుగా చేపట్టినప్పటికీ హరితవనాలు విస్తరించడం లేదు. 2024 జూన్, జూలై నుంచి మండలంలో 20 వేల మొక్కలు నాటినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అందులో గ్రామ పంచాయతీలవారీగా బతికినవిఎన్నో, చనిపోయిన మొక్కలు ఎన్నో అధికారులు చెబుతున్నా వాటిని క్షేత్రస్థాయిలో ఉన్నదానికి పొంతనలేదు. హరితవనాలను పెంచే లక్ష్యం బాగున్నా ఆచరణలో మాత్రం లక్ష్యానికి భిన్నంగా ఉంది. ప్రతి వాచర్ నాటిన 400 మొక్కలను సంరక్షించవలసి ఉంది. ఇందుకు జాతీయ ఉపాధిహామీ పథకం కింద రూ.270 రోజుకు చెల్లిస్తారు. ఒక వాచర్ వంద రోజుల పనిదినాలకు మించి పని చేయరాదనే నిబంధన కూడ ఉంది. నాటిన మొక్కలకు ఆలనా, పాలనలేక ఎండల తీవ్రతకు మొక్కలు నిలువునా ఎండుతున్నాయి. డిండి నుంచి దేవరకొండకు వెళ్తున్న ప్రధాన రహదారికి ఇరువైపులా ప్రతి ఏడాది మొక్కలు నాటుతున్నప్పటికీ అవి ఆనవాళ్లు లేకుండా పోయాయి. మొక్కలు నాటేందుకు రూ.లక్షఖర్చు చేస్తున్నారే కాని వాటిపై పర్యవేక్షణ లేమి పొట్టొచ్చునట్లు కనిపిస్తుంది.

భారంగా మారిన ట్యాంకర్ల నిర్వహణ

నాటిన మొక్కలకు గ్రామపంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీరు పోయాల్సి ఉంటుంది. కానీ పంచాయతీ కార్యదర్శులు మాత్రం నిధులలేమితో వాటర్ ట్యాంకర్ల నిర్వహణ భారంగా మారింది. ఇప్పటికే తాను రూ.1.40 లక్ష అప్పుచేసి చేతి నుంచి ఖర్చు చేసినట్లు ఓ గ్రామకార్యదర్శి ఆవేదన వ్యక్తం చేశారు. పంచా యతీలకు స్టేట్ ఫైనాన్స్ నుంచి 2024 ఆగస్టులో చిన్న పంచా యతీలకు రూ. 50వేలు, మేజర్‌పంచాయతీ లకు రూ.లక్ష విడుదలయ్యాయి. తరువాత నిధులు విడుదల కాలేదు. టీఎస్ బీపాస్ ద్వారా పారిశుధ్య కార్మికులకు మాత్రం వేతనాలు చెల్లిస్తున్నారే కాని పంచాయతీల నిర్వాహణకు మాత్రం నిధుల కేటా యింపు లేకుండా పోయింది. మూడు నెలలకు ఒక్కసారి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఫైనాన్స్ నుంచి పంచాయతీలకు నిధులు రావలసి ఉంటుంది. 2024 మార్చిలో 15వ ఫైనాన్స్ నుంచి చిన్నపంచాయతీలకు రూ.80వేలు, మీడియా పంచాయతీలకు రూ.1.60 లక్షలు, మేజర్ పంచాయతీలకు రూ.1.70 లక్ష నిధులు విడుదలయ్యాయి. అప్పటి నుంచి పం చాయతీలకు నిధులులేక మోటార్ల మరమ్మతులు, విద్యుత్ దీపాలు, ట్రాక్టర్ డిజిల్ కోసం కార్యదర్శులు పడరాని పాట్లు పడుతు న్నారు. కొద్ది వేతనాలతో పనిచేస్తున్న మేము అప్పులు చేసి గ్రామ పంచాయతీలను ఎందుకు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు. ప్రతాప్ నగర్‌లో రూ.9 లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన పల్లెప్రకృతివనం, బృహత్ ప్రకృతి వనాల్లో మొక్కలు లేకపోవడం గమనార్హం.

మొక్కలు కాపాడాలి



వనమహోత్సవంలో నాటిన మొక్కలు నీళ్లలేక ఎండుతున్నా యి. లక్షల రూపాయలు ఖర్చుచేసి నాటిన మొక్కలు సరైన పోషణలేక ఎండు తున్నాయి. ప్రభుత్వం గ్రామపంచాయతీలకు నిధు లు విడుదల చేయాలి. ట్యాంకర్ల ద్వారా ఈ వేసవి లో మొక్కలకు నీరుపోసి కాపాడాలి.
-గుర్రం సురేష్, డిండి

మొక్కలు కాపాడుతాం



హరితహారం, వనమహోత్సవంలో నాటిన మొక్కలను ఏవిధంగానైనా కాపాడుతాం. ఇప్పటికే పం చాయతీ కార్యదర్శులకు ట్యాంకర్ల ద్వారా నీరు పోయాలని సూచనలు చేశాం. మహత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ ద్వారా నగదు జమకూరుస్తాం. - వెంకన్న,ఎంపీడీవో, డిండి



















మత సామరస్యానికి కట్టుబడింది బీఆర్ఎస్సే

● ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మిర్యాలగూడ, మార్చి 29 (ఆంధ్ర జ్యోతి): మతసామరస్యానికి కట్టుబడి పేద ముస్లింలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కు తుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. శనివారం చిన్న మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ముస్లింలకు బీఆర్ఎస్ ప్రభుత్వం తోఫాను ఇచ్చి సత్కరించిందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి, నల్లమోతు సిద్దార్థ, మసీద్ కమిటీ అధ్యక్షులు హమ్మద్‌పాష, వాలీయల్లా, ముగ్దాం, హైమద్ చాహూస్ పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటిరంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం ఆదివారం జిల్లాకు వస్తునందున్న అధికారులు, మంతులతో చర్చించి ప్రాజెక్టుల పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. ల్యాండ్ రెగ్యులేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)లో ఫీజు చెల్లించేందుకు అనేక అడ్డంకులు, సర్వర్ డౌన్లు, పండుగ సెలవులు వచ్చినందున ఎల్ఆర్ఎస్‌కు 50 శాతం రాయితీ ఇచ్చి గడువును మరో నెల రోజులు పెంచి ప్రజలకు అవకాశం కల్పించాలని కోరారు. మునిసిపల్ ఆస్తిపన్నులో వడ్డీని వందశాతం మాఫీ చేసి గడువును పెంచాలని కోరారు. రైతులందరికీ రుణమాఫీ కల్పించాలన్నారు. అడవిదేవులపల్లి సత్రసాల వద్ద రెండు రాష్ట్రాల భాగస్వామ్యంలో కృష్ణానది పై వంతెన నిర్మించాలని అన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవి నాయక్, భవా ండ్ల పాండు, పాదూరి శశిధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీతోనే రాజకీయ చైతన్యం

● పలు మండలాల్లో ఆ పార్టీ ఆవిర్భావ వేడుకలు



మిర్యాలగూడలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వెంకటేశ్వర్లు తదితరులు

మిర్యాలగూడటౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పలు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీతోనే రాజకీయ చైతన్యం వచ్చిందన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీని వాస్, ఓబీసీ విభాగం రాష్ట్ర నాయకుడు పోగుల సైదులుగౌడ్, పాల్గొన్నారు.

● దామరచర్ల : మండల కేంద్రంలో టీడీపీ నాయకులుపార్టీ జెండానుఎగురవేశారు. అనంతరం జిల్లా నాయకుడు ధీరావత్ మాన్యానాయక్, ఎస్‌కే నాగుల్ మీరా మాట్లాడుతూ టీడీపీకి పునర్ వైభవం తీసుకొచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

● నిడమనూరు : మండల కేంద్రంలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముప్వా అరుణ్‌కుమార్, మండలాధ్యక్షుడు మంద తిరుపతయ్య, ఉన్నం కృష్ణయ్య, విజయ్‌బాస్కర్, కేవీటీ, సీతయ్య, పెద్దనారాయణ పాల్గొన్నారు.

● దేవరకొండ : దేవరకొండలో టీడీపీ జెండాను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వస్కుల కృష్ణయ్య ఎగురవేశారు. ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో దేవరకొండ మండల టీడీపీ అధ్యక్షుడు గార్లపాటి శ్రీను, పోతి అమరేందర్‌రెడ్డి, గార్లపాటి కృష్ణయ్య పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి : మండలకేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్, జిల్లా అడహక్ కమిటీ సభ్యుడు జడ రాములుయాదవ్, టీడీపీ మండలాధ్యక్షుడు షేక్ రసూల్, కట్టా అనంతరెడ్డి, యాకోబ్, అంజయ్య, గోపాల్, విద్యాసాగర్, కాశయ్య, అక్బర్, రమేష్ పాల్గొన్నారు.

● వేములపల్లి : మండల కేంద్రంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు జడ రాములుయాదవ్ కార్యకర్తలతో కలిసి కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. గుండెబోయిన మల్లయ్య, చిలకల నాగయ్య, గంగుల వెంకన్న, వెంకట్‌రెడ్డి, సాంబయ్య పాల్గొన్నారు.

పండుగల సందడి...



మిర్యాలగూడ గణేశ్ మార్కెట్‌లో కొనుగోలు దారుల సందండి

మిర్యాలగూడ టౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలో పండుగల సందడి శని వారమే మొదలైంది. ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ కావడంతో పట్టణంలోని నేతాజీ గణేష్ మార్కెట్, రైతు బజార్, పూలమార్కెట్‌లలో విపరీత రద్దీ కనిపించింది. పాతమార్కెట్‌లోకి వెళ్లేందుకు సాగర్‌రోడ్‌లోని గణేష్ టెంపుల్ వద్ద ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. ఓ వైపు బంగారం ధరలు ఆకాశాన్నంటుతుండగా నూతనంగా వెలిసిన జ్యువెల్లరీ దుకాణాలలో నగల కొనుగోళ్లు యధావిధిగా కొనసాగాయి.

దేవరకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉమా మహేశ్వర్



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

దేవరకొండ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): దేవరకొండ బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా సన్నాయిల ఉమమహేశ్వర్, కార్యదర్శిగా కర్నాటి సురేష్, ఉపాధ్యక్షుడిగా వస్కుల శ్రీనివాస్, సహాయకార్యదర్శిగా మట్టిపల్లి యాదయ్య, క్రీడా విభాగం అధ్యక్షురాలిగా చిలు వేరు పుష్పలత, కోశాధికారిగా శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా ఎర్ర కృష్ణ, ఇద్దయ్య, శంకర్, గణేష్‌ను ఎన్నుకున్నట్లు ఎలక్షన్ అధికారి ఇడం రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు గౌరిశంకర్, అంజద్, గాజుల ఆంజనేయులు, రమాశంకర్, ముస్తాక్, రామకృష్ణ, శౌకత్‌అలీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి పరామర్శ



యాకూబ్‌అలీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నిడమనూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహమ్మద్ యాకూబ్ అలీ, కుందూరు లక్ష్మారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి మండలంలోని గుంటిపల్లి, నిడమనూరు గ్రామాల్లో వారి నివాసాలకు వెళ్లి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గుంటిపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళకు ఆర్థిక సాయం అందించారు. శాఖాపురం గ్రామంలో అనా రోగ్యంతో బాధపడుతున్న సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ చేకూరి హన్మంతరావును పరామర్శించి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు నందికొండ మట్టారెడ్డి, ముంగి శివమారయ్య, బొల్లం శ్రీనివాస్, నర్సింగు విజయ్‌కుమార్, చర్క శ్రీను, పురుషోత్తంరెడ్డి, సిరిశాల యాదగిరి తదితరులు ఉన్నారు.

కవులకు పుట్టినిల్లు దేవరకొండ

దేవరకొండ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కవులు, కళాకారులకు పుట్టినిల్లు దేవరకొండ అని దేవరకొండ నియో జకవర్గ తెలంగాణ సాహితీ సాంస్కృతిక అధ్యాయన వేదిక (తెస్సా) అధ్యక్షుడు పర్వాసుదేవరావు అన్నారు. విశ్వావసునామ సంవత్సరం ఉగాదిని పురస్కరించుకొని దేవరకొండ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. దేవరకొండకు చెందిన కవులు పుస్తకాలు, కవిలు రాస్తు కవిత రంగంలో రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారని అన్నారు. కవులు, కళాకారులకు, సాహితీవేత్తలకు ఎప్పుడు ఆదరణ ఉంటుందన్నారు. విశ్వావసునామ సంవత్సరంలో వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయని, పంటలు పండు తాయన్నారు. ఈకార్యక్రమంలో తెస్సా కార్యదర్శి రంజాన్‌బేగ్, బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, నేతాళ్ల వెంకటేష్, ఉడుత సలేశ్వర్‌యాదవ్, భిక్షమయ్య, టైగర్ జీవా, శ్రీనివాస్, వెంకటరమణ కవితలు చదివారు. అనంతరం తెస్సా అధ్యక్షుడు పర్వాసుదేవరావును పలువురు కవులు సన్మానించారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

మిర్యాలగూడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి):దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ తలపెట్టిన చలో ఢిల్లీ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 2న జంతర్‌మంతర్ వద్ద బీసీల పోరుగర్జన నిర్వహి ంచనున్నట్లు పేర్కొన్నారు. బంటు వెంకటేశ్వర్లు, గుండెబోయిన నాగేశ్వరరావు యాదవ్, ఎర్రబెల్లి దుర్గయ్య, మాడుగుల శ్రీనివాస్, చేగొండి మురళీ యాదవ్, నాగరాజు, శేఖర్, కవిత పాల్గొన్నారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

దేవరకొండ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంక్షేమ సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు ఇరగదిండ్ల కృష్ణ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. వడ్డెర్లు పలు సమస్యలతో ఇబ్బందులుపడుతున్నారని అన్నారు.